మనం

/manamnews
www.manamnews.com

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
శుక్రవారం
28-07-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 177
పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

శ్రావణ మాసం, శుక్రవారం, తిథి : దశమి మ.02.51 వరకు, నక్షత్రం: అనురాధ, తె :01.28 వరకు, వర్జ్యం: ఉ.06.12-07.43 వరకు, దుర్ముహూర్తం: మ.12.48-01.39 వరకు, రాహుకాలం: మ.10.46-12.22 వరకు

మోడీ భావజాలంతోనే మణిపూర్ మంటలు

అందుకే ఆయన నోరు విప్పడం లేదు

వీడియో సందేశంలో రాహుల్ విమర్శలు

2

జలదిగ్బంధం

రాష్ట్రంలో ఎడతెరిపి వర్షాలు

జనజీవనం అస్తవ్యస్తం

సహాయక చర్యలు ముమ్మరం

హైదరాబాద్‌ను వదలని వాన

తడిసి ముద్దవుతున్న నగరం

అప్రమత్తంగా ఉండాలని సూచన

బయటకు రావద్దని ప్రజలకు హెచ్చరిక

నేటి వరకు స్కూళ్లకు సెలవుల పొడిగింపు

అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు

అవసరమైతే సైనిక హెలికాప్టర్‌ల్ వినియోగానికి ఆదేశాలు

భారీ వర్షాలపై సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, జూలై 27 (మనం న్యూస్): రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. భారీ వరదలపై సమీక్ష నిర్వహించిన సీఎం కేసీఆర్.. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు శుక్రవారం కూడా సెలవు ప్రకటించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆదేశించారు. శనివారం మొహర్రం సెలవు కావడంతో ప్రభుత్వ విద్యాసంస్థలు అన్నీ సోమవారం తెరుచుకోనున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. ములుగు జిల్లా ప్రత్యేకాధికారిగా కృష్ణ ఆదిత్య, భూపాలపల్లి జిల్లాకు పీ.గౌతమ్, నిర్మల్ జిల్లాకు ముషారఫ్ అలీ, మంచిర్యాల జిల్లా ప్రత్యేక అధికారిగా భారతి హోళికేరిని నియమించారు. మునుపెన్నడూ లేని రీతిలో తెలంగాణ చరిత్రలో అత్యంత రికార్డు స్థాయిలో వర్షపాతాలు నమోదవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ములుగు జిల్లా వాజేడులో ఈనెల 19 తరవాత మళ్లీ గడచిన 24 గంటలలో 51.5 సెం.మీల వర్షం పడింది. గత 24 గంటలలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో 64 సెం.మీల వర్షం పడింది. గత 24 గంటలలో రాష్ట్రంలోని 35 ప్రాంతాల్లో 20 సెం.మీ పైన వర్షపాతం నమోదు కాగా, 200ల కేంద్రాల్లో 10 సెం.మీల పైగా వర్షం పడింది.రెండు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లాలో 45 సెం.మీల వర్షపాతం నమోదైంది. బుధవారం నుంచి ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైతే హెలికాప్టర్లను కూడా తరలించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పాఠశాలలకు శుక్రవారం వరకు సెలవులు పొడిగించారు. పోలీసు శాఖ సహాయక చర్యల్లో పాల్గొనాలని డిజిపి ఆదేశించింది. వాగులు ..మిగతా 2లో

ప్రజల కలలు నెరవేరుతున్నాయి

ప్రతిపక్షాలు ఆగ్రహిస్తున్నాయి: ప్రధాని మోడీ

పేదలకు వ్యతిరేకంగా వాళ్లు పన్నిన కుట్రలు

ఇండియా' పేరు దేశభక్తితో కాదు..

విపక్షాలపై విరుచుకుపడ్డ ప్రధాని మోడీ

రాజ్‌కోట్, జూలై 27 : దేశంలోని సామాన్య ప్రజల కలలు నెరవేరుతున్నాయని దీంతో ప్రతిపక్షాలు ఆగ్రహిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్లోని రాజ్‌కోట్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషిచేసిందని.. అలా చేసి ఉండకపోతే నిత్యావసర ధరలు మరింతగా పెరిగేవన్నారు. ప్రజలను (అభివృద్ధి కోసం) దాహంతో ఉంచినవారు, వారి ఆకాంక్షలు, ఆశలను పట్టించుకోని వారు నేడు ప్రజల కలలు సాకారమవుతుంటే చూసి ఆగ్రహిస్తున్నారంటూ విపక్షాలపై విరుచుకుపడ్డారు. అవినీతి, వారసత్వంతో కూడినవారు ఆ బృందం (విపక్షాల కూటమి) పేరు మార్చుకుందే తప్ప ఆ ముఖాలు పాతవేననన్నారు. ఆ గ్రూపు పద్ధతులు, ఉద్దేశాలు ఒకేలా ఉంటాయని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేను అధికారంలోకి రానీయకుండా నిలువరించేందుకు 26 విపక్ష పార్టీలు కలిసి ఏర్పాటు చేసిన 'ఇండియా' కూటమిని ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. సుపరిపాలన హామీతో అధికారంలోకి వచ్చి వచ్చిన ఎన్డీయే.. ఈ తొమ్మిదేళ్లలో అమలు చేసిందన్నారు. ఇంతకు ముందు ప్రభుత్వం కొనసాగితే ..మిగతా 2లో



పార్లమెంట్‌ను వదలని మణిపూర్

చర్చకు ఉభయసభల్లో సభ్యుల పట్టు

నల్ల దుస్తులతో నిరసన తెలిపిన విపక్ష సభ్యులు

ఉభయ సభలు వాయిదా

ఈ పోరాటం ఆగదు

కొనసాగుతూనే ఉంటుంది: ఖర్గే

వివరాలు.. 2లో

కేంద్రానికి ఊరట..

ఇడి చీఫ్ పదవీకాలం పొడిగింపు

సెప్టెంబర్ 15 వరకు అనుమతించిన సుప్రీం

దేశ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే కేంద్రం విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్నట్టు కోర్టు తెలిపింది

వివరాలు.. 2లో



జమిలి ఎన్నికలు సాధ్యం కాదు

పార్లమెంటులో ప్రకటించిన కేంద్రం

గత కొన్నేళ్లుగా చర్చనీయాంశమైన జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జమిలి ఎన్నికల నిర్వహణ కష్టమని పార్లమెంట్‌లో తేల్చి చెప్పింది. ప్రస్తుతం దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని పేర్కొంది. ఈ మేరకు పార్లమెంట్లో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. జమిలి ఎన్నికలతో లాభాలు ఉన్నప్పటికీ, ఒకేసారి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే పని కాదని మేఘ్వాల్ తెలిపారు.

వివరాలు.. 2లో

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పుత్రశోకం

చికిత్స పొందుతూ మృతి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి

అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రులు మహమూద్ అలీ, హరీశ్, ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని పరామర్శించిన బీజేపీ ఎమ్మెల్యేలు

2

అమిత్ షా టూర్ మళ్లీ వాయిదా

2

ఎల్ఎండి గేట్లు ఎత్తివేత

దిగువకు నీటి విడుదల

2

ప్రతిపక్షాలు చిల్లర విమర్శలు చేయొద్దు

ప్రాణ నష్టం జరగకుండా చూడటమే ప్రధాన లక్ష్యం: మంత్రి కేటీఆర్

సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు

వరద పరిస్థితులపై కేటీఆర్ సమీక్ష

అధికారులతో కలసి క్షేత్రస్థాయి పరిశీలన

వర్ష పరిస్థితులను సమీక్షించిన కేటీఆర్

క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు

2

ప్రియాంక గాంధీ సభ వాయిదా

2

ఒడ్డుకు చేరిన గ్రామస్తులు

సీఎం కేసీఆర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఆర్మీ

2

అంతా సురక్షితం

2

మున్నేరులో చిక్కుకున్న ఏడుగురు

రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందం

వరద పరిస్థితిపై పువ్వాడకు కేసీఆర్ ఫోన్

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

నిండు ప్రాణం బలి

పాల ప్యాకెట్ కొనడానికి వచ్చి అనంత లోకాలకు..

రోడ్డున పడ్డ కుటుంబం

ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ప్రజల, కుటుం సభ్యుల వినతి

హనుమకొండ, జులై 27, మనం న్యూస్ : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలయ్యింది. గురువారం హనుమకొండలోని ..మిగతా 2లో

మంచిమాట

ఎవరి ధనం కోసమో ,
ఎవరి బంధం కోసమో
మనం పాకులాడే
అవసరంలేదు.
మన మాట మన గుణం
బాగుంటే అవే మన
దగ్గరకు వస్తాయి.!

శుభోదయం

జమిలి ఎన్నికలు సాధ్యం కాదు..

న్యూఢిల్లీ, జూలై 27 : జమిలి ఎన్నికలు అనే అంశం ప్రస్తుతం లా కమిషన్ పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తెలిపారు. లోక్ సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకే సారి ఎన్నికలు జరిపే అంశంపై సాధ్యాసాధ్యాలను లా కమిషన్ పరిశీలిస్తోందని స్పష్టం చేశారు. జమిలీ ఎన్నికల కోసం ఆచరణాత్మక రోడ్ మ్యాప్, ఫ్రేమ్ వర్కును తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు జమిలి ఎన్నికల అంశంపై ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ సమాధానమిచ్చారు. న్యాయ శాఖ స్టాండింగ్ కమిటీ కూడా జమిలి ఎన్నికల అంశంపై పరిశీలన చేసిందని అర్జున్ రామ్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం సహా వివిధ భాగస్వాములతో చర్చలు జరిపిందని పేర్కొన్నారు. జమిలీ ఎన్నికలు అనే అంశం దేశాన్ని భాజపా నేతృత్వంలోని కేంద్రం తెరమీదకు తీసుకువచ్చింది. ఎన్నికలను దేశమంతా ఒకేసారి జరపాలనే ప్రతిపాదన ఎంత వరకు సాధ్యమవుతుంది? అనే అంశంపై పరిశీలన చేస్తున్నారు. అయితే.. ఈ అంశం గతంలోనూ రాజకీయ వివాదానికి తెరతీసింది. ఒకేసారి ఎన్నికలు జరిపితే.. పలు ప్రాంతీయ పార్టీల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుందని మేధావులు గతంలో అభిప్రాయపడ్డారు.

కేంద్రానికి ఊరట..

న్యూఢిల్లీ, జూలై 27 : ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చీఫ్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలాన్ని 15సెప్టెంబర్ 2023 వరకు పొడగింపునకు సుప్రీంకోర్ట్ అనుమతిచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తికి అత్యున్నత న్యాయస్థానం అంగీకారం తెలిపింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే కేంద్రం విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్నట్టు కోర్టు తెలిపింది. కాగా.. ఈడీ చీఫ్‌గా ఉన్న సంజయ్ కుమార్ పదవీకాలాన్ని మూడోసారి పొడగించడం చట్టవిరుద్ధ మవుతుందని జూలై 11న సుప్రీంకోర్ట్ విముఖత వ్యక్తం చేసింది. 2021 తీర్పునకు ఇది వ్యతిరేకమని తిరస్కరించింది. అయితే బదిలీ పక్రియ సాఫీగా జరిగాలనే ఉద్దేశ్యంతో సంజయ్ కుమార్‌ను జులై 31, 2023 వరకు కొనసాగించేందుకు అనుమతిచ్చింది. అయితే ఎఫ్‌ఏటీఎఫ్ సమీక్ష కీలకమైన దశలో ఉందని, ఈ సమయంలో ఆయన గైర్హాజరైతే ఎదురయ్యే పరిణామాలను తెలియజేస్తూ జూలై 21న కోర్టుకు తెలియజేసింది. ఆన్‌సైట్ విజిట్ నవంబర్ 2023లో జరగాల్సి ఉందని పేర్కొంది. దేశవ్యాప్తంగా మనీల్యాండరింగ్ దర్యాప్తులు, పక్రియల్లో ఈడీ చీఫ్‌గా ఆయన చాలా ముఖ్యమైన వ్యక్తిగా ఉన్నాని వివరించారు.

మోడీ భావజాలంతోనే మణిపూర్ మంటలు

న్యూఢిల్లీ, జూలై 27 (మనం న్యూస్): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భావజాలమే మణిపూర్‌ను తగులబెడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గురువారం తీవ్ర విమర్శలు గుప్పించారు. తన భావజాలమే మణిపూర్‌ను తగులబెడుతోందని ఆయనకు బాగా తెలుసునని, అందుకే ఆయన నోరు విప్పడం లేదని ఆరోపించారు. మోదీ కేవలం అతి కొద్ది మందికి మాత్రమే ప్రధాన మంత్రి అని దుయ్యబట్టారు. మణిపూర్ మహిళల బాధల గురించి ఆయన పట్టించుకోరన్నారు. రాహుల్ గాంధీ గురువారం విడుదల చేసిన వీడియో సందేశంలో, 'మణిపూర్‌లో ఏం జరుగుతోందో మీరందరూ చూశారు. ఓ రాష్ట్రం తగులబడుతూ ఉంటే, దేశ ప్రధాన మంత్రి ఏదైనా చెబుతారని మీరు భావించి ఉంటారు. ప్రధాని కనీసం ఇంఫాల్ వెళ్లి, ప్రజలతో మాట్లాడతారని మీరు అనుకొని ఉంటారు. మణిపూర్ రాష్ట్రానికి ప్రధాన మంత్రి ఎందుకు వెళ్లడం లేదో, ఎందుకు మాట్లాడటం లేదో తెలుసుకుంటే మీకు ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకంటే నరేంద్ర మోదీ కేవలం కొందరికి మాత్రమే, ఆరెస్సెస్‌కు మాత్రమే ప్రధాన మంత్రి. మణిపూర్ గురించి ఆయనకు పట్టదు. ఆయన భావజాలమే మణిపూర్‌ను తగులబెడుతోందని ఆయనకు తెలుసని ఆరోపించారు.

పార్లమెంట్‌ను వదలని మణిపూర్

న్యూఢిల్లీ, జూలై 27 : మణిపూర్ అంశంపై గత అయిదు రోజుల నుంచి పార్లమెంట్ సమావేశాలు దద్దరిల్లుతున్న విషయం తెలిసిందే. ప్రధాని ఆ అంశంపై ఉభయసభల్లో ప్రకటన చేయాలని విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం కూడా లోక్‌సభలో విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. నల్ల బట్టలు వేసుకుని వచ్చిన ఇండియా కూటమి సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నారు. పార్లమెంట్ ఉభయసభలు గురువారం కూడా మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి. సభ ప్రారంభం కాగానే స్పీకర్ ప్రశ్నోత్తరాల అవర్‌ను చేపట్టారు. అయితే మణిపూర్ అంశంపై ప్రధాని మోడీ చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పాటు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో లోక్‌సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. రాజ్యసభను కూడా మధ్యాహ్నం రెండుగంటల వరకు వాయిదా పడింది. ప్రధాని మోదీ సమక్షంలో మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇవాళ ఉదయం పార్లమెంట్ ఆవరణలో కొందరు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. రాజ్యసభకు చెందిన విపక్ష ఎంపీలు ఆ ఆందోళనలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ సభకు వచ్చి మణిపూర్‌పై ప్రకటన చేయాలని ఆ ఎంపీలు నినాదాలు చేశారు. నల్ల దుస్తులు ధరించిన విపక్ష ఎంపీలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విమర్శలు చేశారు. ఆ దుస్తులు ధరించిన వాళ్ల ప్రస్తుత పరిస్థితి, గతం, భవిష్యత్తు కూడా నలుపే అని ఆయన రాజ్యసభలో ఆరోపించారు. కానీ వాళ్ల జీవితాల్లో వెలుగు వస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. మణిపూర్ అంశంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. బీజేపీ, ప్రధాని ఒక్కటే అని, ఆర్‌ఎస్‌ఎస్ విద్వేషాన్ని వ్యాప్తి చేసిందని, బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నట్లు ఆయన ఆరోపించారు. మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలకు ఇదే తార్కాణమని ఆయన అన్నారు. ప్రభుత్వం అన్ని అంశాలపై అవగాహనతో ఉండాలన్నారు. ఏజెన్సీలకు ఏమీ తెలియదని పేర్కొనడం శోచనీయమన్నారు.

ఈ పోరాటం ఆగదు: ఖర్గే

న్యూఢిల్లీ, జూలై 27 : ఈశాన్య రాష్ట్రం మణిపుర్ అంశంపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడంపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి మండిపడ్డారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రధాని తీరుపై విమర్శలు గుప్పించారు. మణిపుర్ 85 రోజులుగా హింసతో మండిపోతోంది. పార్లమెంట్లో మణిపుర్ హింసపై ప్రధాని మోదీ మాట్లాడాలని కోరుతున్నా.. అందుకు ఆయన సుముఖత చూపడం లేదు. ప్రస్తుతం రాజస్థాన్లో రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. ప్రజలకు ప్రస్తుత రాజకీయాలపై అవగాహన ఉంది. ఈ విధమైన రాజకీయాలపై వారు పోరాటం చేస్తారు. ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. అని దుయ్యబట్టారు. దేశ చరిత్రలో ఇలాంటి రోజును ఎన్నడూ చూడలేదని ఖర్గే అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మానవత్వానికి మచ్చగా మారు తోందని ఆరోపించారు. ఈ అంశంపై ప్రధాని పెదవి విప్పకపోవడం బాధాకరమన్నారు.

జలదిగ్బంధం

(మొదటిపేజీ తరువాయి)

వంకలు పొంగడమే గాకుండా ప్రాజెక్టులు నిండి పొంగుతున్నాయి. కృష్ణా,గోదావరి నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. హన్మకొండ పట్టణంనీట మునిగింది. సాయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. దానికి అనుబంధంగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గత మూడు రోజులుగా గ్రేటర్ హైదరాబాద్ వర్షంలో తడిసి ముద్దవుతున్నది. గురువారం కూడా భారీ వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరానికి హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కె.నాగరత్న హైఅలర్ట్ ప్రకటించారు. గంటకు 5 సెం.మీ. నుంచి 6 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. నగరంలో రాత్రి నుంచి ఎడతెరపిలేకుండా వర్షంకురుస్తున్నది. బుధవారం సాయంత్రం ప్రారంభమైన వాన తెల్లవార్లు ఏకధాటిగా కురుస్తూనే ఉన్నది. మారేడుపల్లి, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, జవహర్ నగర్, బొల్లారం, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సీతాఫల్‌మండి, కుత్బుల్లాపూర్, నాగోల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, కోఠీ, నాంపల్లి, లక్డీకాపూల్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మెహదీపట్టం, చాంద్రాయణగుట్ట, సాగర్ రింగ్‌రోడ్డు, బీఎన్‌రెడ్డిలో భారీ వర్షం కురుస్తున్నది. వర్షాల ధాటికి నాగోల్‌లోని అయ్యప్ప కాలనీలో ఇండ్లలోకి వరద నీరుచేరింది. లింగపల్లి రైల్వే అండర్‌పాస్ వద్ద భారీగా వరద నీరు చేరింది. దీంతో రాకపోకలు నిలిచి పోయాయి. గచ్చిబౌలిలింగంపల్లి మార్గాల్లో వెళ్లాల్సిన వాహనాలను ట్రాఫిక్‌పోలీసులు దారిమళ్లిస్తున్నారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భార్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే భారీ వర్షాలతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అప్రమత్తమ య్యారు. రోడ్లపై నీరు నిలువకుండా వచ్చిననీటిని వచ్చినట్లే పోయేట్లు చూస్తున్నారు. డీఆర్‌ఎఫ్ సిబ్బంది, పోలీసులు, మున్సిపల్ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. బీఆర్‌కే భవన్ వద్ద రోడ్డుపై చెట్టు కూలిపోయింది. దీంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్‌లో వర్షం పరిస్థితులపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రస్తుత పరిస్థితులు, అందుతున్న సహాయక చర్యలపై మేయర్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌లతో కలిసి సమీక్షించనున్నారు. ఇక వర్షాల విషయానికి వస్తే మరో రెండు రోజుల పాటు భాగ్యనగరంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. బుధవారం రాత్రి నుంచి హైదరాబాద్‌లో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొన్ని సార్లు అత్యంత వేగంగా జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల నుంచి 21 డిగ్రీల మధ్య ఉంటాయని చెప్పింది. ఉపరితల గాలులు గంటకు 10 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని చెప్పింది. అత్యవసరం అయితేనే బయటకు రావాలంటూ అధికారులు సూచించారు. నిన్నటి నుంచి హైదరాబాద్ లో ముసురు పడుతోంది.

ప్రతిపక్షాలు చిల్లర విమర్శలు చేయొద్దు..

హైదదరాబాద్:, జులై 27 (మనం న్యూస్) :గత కొన్ని రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు హైదరాబాద్ నగరం అతలాకుతలమవుతోంది. ఇవాళ మూసారాంబాగ్ వద్ద వరద పరిస్థితి, మూసీపైలో లెవెల్ వంతెనను కేటీఆర్ పరిశీలించారు. గురువారం అసాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచన నేపథ్యంలో.. నగరవాసులకు భారాస శ్రేణులు అండగా నిలవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ''ముంపు ప్రాంతాల్లో చేపట్టే సహాయక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలి. ప్రజలకు నిత్యావసరాల పంపిణీ, ఇతర సాయం అందించాలి. పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజలకు పార్టీ శ్రేణులు అండగా నిలవాలి'' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. పురపాలకశాఖ అధికారులతోనూ సీఎం ప్రత్యేకంగా మాట్లాడినట్టు తెలిపారు. వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రాథమిక ప్రాధాన్యతగా పనిచేయాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణాల్లో ఉన్న పరిస్థితులపైనా సమీక్షించిన కేటీఆర్.. హైదరాబాద్ నుంచి పురపాలక అధికారులు, అడిషినల్ కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా హుస్సేన్సాగర్ వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. శిథిల భవనాల నుంచి జనాలను వెంటనే తరలించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. పురపాలక ఉద్యోగులకు అన్ని సెలవులు రద్దు చేశామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఎడతెరిపి లేకుండా కుంభవృష్టి కురవడం ద్వారా ప్రజలకు కొంత ఇబ్బంది ఎదురవుతోందన్నారు. ప్రాణనష్టం జరగకుండా చూడడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయాలు మాని భారీ వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. భారీ వర్షాల్లో నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం దెబ్బతీసే విధంగా చిల్లర విమర్శలు చేయవద్దన్నారు. మూసీ వరదను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. వరంగల్ నగరానికి వెళ్లాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించామని, అవసరమైతే తాను శుక్రవారం స్వయంగా వెళ్లనున్నట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు.

వర్ష పరిస్థితులను సమీక్షించిన కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జులై 27 (మనం న్యూస్) : భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ అలర్ట్ గా ఉండాలని మంత్రి కెటిఆర్ జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. గురువారం కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అధిక వర్షాలు, వరదల పరిస్థితులపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు అలర్ట్ గా ఉంటూ రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సిరిసిల్ల పట్టణంపైన ఉన్న చిన్న బోనాల చెరువు తెగడం వలన పట్టణంలోని ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అవసరమయితే సహాయక చర్యలకు యంత్రాలను హైద్రాబాద్ నుంచి పంపిస్తామని తెలిపారు. అలాగే ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు.

అంతా సురక్షితం

ఖమ్మం, జూలై 27 (మనం న్యూస్): జిల్లాలో మున్నేరు వరదల్లో చిక్కుకున్న ఏడుగురి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. వారిని క్షేమంగా ఒడ్డుకు చేర్చేందుకు సిబ్బంది చాలా కృషి చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ఉండి సహాయక చర్యలు చేపడుతున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సీఎం కేసీఆర్‌కు ఫోన్ చేశారు. మున్నేరు వరద ఉధృతి, సహాయక చర్యలు ఎలా సాగుతున్నాయని మంత్రి పువ్వాడను కేసీఆర్ అడిగి తెలుసుకుంటున్నారు. వరద ప్రవాహంలో ఓ ఇంట్లో చిక్కుకున్న ఏడుగురిని రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని ఖమ్మం తరలించాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఎన్డీఆర్ఎఫ్ బృందంతో సహా భద్రాచలం నుంచి మంత్రి పువ్వాడ ఖమ్మంకు వెళ్లారు. మున్నేరు ప్రవాహంలో చిక్కుకున్న వారిని రెస్క్యూ చేసినట్లు మంత్రి పువ్వాడ వెల్లడించారు. విశాఖ నుంచి భద్రాచలం వస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని మార్గమధ్యంలో ఖమ్మం మళ్లించాలని సీఎం చెప్పినట్లు వివరించారు. ఆయన ఆదేశాల మేరకు రెస్క్యూ చర్యలు కొనసాగుతున్నాయని.. ప్రత్యేక డ్రోన్ ద్వారా ఇంట్లో చిక్కుకున్న ఏడుగురి పరిస్థితిపై ఆరా తీస్తున్నట్లు ఖమ్మం జిల్లా అధికారులు వెల్లడించారు. ఖమ్మం నగరంలోని పద్మావతి నగర్ ధ్యాన మందిరంలో ఉన్న ఏడుగురిని కాపాడేందుకు రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగింది. వరద ఉధృతితో సహాయక చర్యలకు తీవ్ర ఆంటంకం కల్గుతోంది. అయితే మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, అదనపు కలెక్టర్ ప్రియాంక సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మున్నేరు వరదల్లో చిక్కిన శ్రీరామ చంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన మందిరంలోని ఏడుగురు పేర్లను తెలిపారు. 55 ఏళ్ల లక్ష్మి నారాయణ, 50 ఏళ్ల లక్ష్మి, 26 ఏళ్ల యశ్వంత్, 34 ఏళ్ల అరవింద్, రెండేళ్ల విఘ్నేష్, 27 ఏళ్ల ప్రవల్లిక, 26 ఏళ్ల కావ్యగా గుర్తించారు. ఆ ఏడుగురు బాధితులను అధికారులు సురక్షితంగా రక్షించారు. అలాగే నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. పరిస్థితులను ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలని లోతట్టు ప్రాంతాలైన వెంకటేశ్వర నగర్, మోతీ నగర్, బొక్కల గడ్డ, జలగం నగర్, దానవాయి గూడెం ప్రజలను పూర్తి స్థాయిలో పునరావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి అధికారులకు సూచించారు ప్రజలు అధికారులకు సహకరించి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని వివరించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం.. ప్రభుత్వం నయాబజార్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఎల్ఎండి గేట్లు ఎత్తివేత

తిమ్మాపూర్, జులై 27 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం లోయర్ మానేరు డ్యాంలోకి భారీగా వరద నీరు చేరడంతో గురువారం సాయంత్రం మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా ఆరు గేట్లు ఎత్తారు. అనంతరం ఇన్ ఫ్లో అధికం కావడంతో మరో ఆరు గేట్లను ఎత్తి మొత్తం 12 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహాన్ని బట్టి అవసరమైన పక్షంలో మరిన్ని గేట్లను ఎత్తనున్నట్లు ఎల్ఎండి ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రియాంక గాంధీ సభ వాయిదా

ఈనెల 20న జరగాల్సిన సభను 30కి వాయిదా

హైదరాబాద్, జూలై 27 (మనం న్యూస్): కొల్లాపూర్‌లో ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన ప్రియాంక గాంధీ బహిరంగ సభ మరోసారి వాయిదా పడింది. భారీ వర్షాల కారణంగా ఈ సభను రద్దు చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. దీంతో కాంగ్రెస్ పార్టీలో జూపల్లి కృష్ణారావు చేరిక మరింత ఆలస్యమవుతుంది. కాగా ఈనెల 20న జరగాల్సిన సభను 30కి వాయిదా వేశారు. కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో సభకు ఆటంకం కలిగించే ఛాన్స్ ఉండటంతో కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది. మరో రెండు రోజులు రాష్ట్రానికి భారీ వర్షసూచన ఉండడంతో కాంగ్రెస్ నేతలు ఈ నిర్ణయం తీసుకున్నారు. వర్షాలు, వరదల నేపథ్యంలో జన సమీకరణ కూడా కష్టమయ్యే పరిస్థితి ఉండటంతో ఈ సభను రద్దు చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక సభకు సంబంధించిన తదుపరి తేదీని వెల్లడిస్తామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

ఒడ్డుకు చేరిన గ్రామస్తులు

మోరంచపల్లి గ్రామస్తులను రక్షించిన రెస్క్యూ బృందాలు..

జయశంకర్ భూపాలపల్లి, జూలై 27 (మనం న్యూస్): రెండు మూడురోజులుగా కురుస్తున్న జడివానకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. గ్రామ శివారులో ఉన్న వాగులోకి భారీగా వాన నీరు చేరడంతో గ్రామంలోకి వరద ముంచెత్తింది. తెల్లవారుజామున గ్రామస్తులు నిద్ర లేచేవరకే వరద నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో జనం ఏం చేయాలో తెలియక చెట్లు, ఇంటి మిద్దెపైకి ఎక్కారు. సమాచారం అందుకున్న అధికారులు గ్రామస్తులను రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. సహాయక బృందాలు గ్రామానికి చేరుకొని దాదాపు 200మంది వరకు ప్రజలను సురక్షితంగా కాపాడారు. ముంపు ప్రాంతం నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతానికి బోట్ల ద్వారా తరలించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో రెండు ఆర్మీ హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. ఊరి ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తరలించాయి. వరదలో ఇంకెవరైనా చిక్కుకున్నారేమోనని సహాయక బృందాలు గాలిస్తున్నాయి. మోరంచపల్లిలో రెండు ఆర్మీ హెలికాప్టర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ మిలటరీ అధికారులతో సీఎస్ శాంతికుమారి సంప్రదింపులు జరిపారు. సహాయక చర్యల్లో సాధారణ హెలికాప్టర్ వినియోగించడం కష్టంగా మారడంతో సైన్యంతో చర్చలు జరిపారు. సైన్యం అంగీకారం తెలపడంతో ఆర్మీకి చెందిన రెండు హెలికాప్టర్లను ప్రభుత్వం మోరంచపల్లి గ్రామానికి పంపి.. సహాయక చర్యలు చేపట్టింది.

ప్రజల కలలు నెరవేరుతున్నాయి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు నెలకు మొబైల్ ఫోన్ బిల్లు రూ.6000 చొప్పున చెల్లించాల్సి వచ్చేదన్నారు. ఈజ్ ఆఫ్ లివింగ్, క్వాలిటీ ఆఫ్ లైవ్ తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతల్లో ఒకటన్న ప్రధాని.. డిజిటల్ ఇండియాతో సామాన్యుల సమస్యల్నింటినీ పరిష్కరించామన్నారు. కొన్నేళ్లుగా రాజ్కోట్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నా రు. ఇప్పుడు సౌరాష్ట్రకు గ్రోత్ ఇంజిన్గా గుర్తింపు సాధించిందని చెప్పారు.

ఇండియా' పేరు దేశభక్తితో కాదు..

జైపూర్: విపక్ష కూటమి 'ఇండియా' ఏర్పాటు తర్వాత.. ప్రధాని నరేంద్ర మోదీ వీలుచిక్కినప్పుడల్లా విమర్శలు గుప్పిస్తూనే వస్తున్నారు. తాజాగా మరోసారి ఆయన విపక్ష కూటమిని ఏకిపారేశారు. గతంలో చేసిన తప్పుల్ని దాచిపెట్టేందుకు.. యూపీఏ నుంచి ఇండియాగా వాళ్లు పేరు మార్చుకున్నారని మండిపడ్డారాయన. రాజస్థాన్ సికర్‌లో గురువారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ''పేదలకు వ్యతిరేకంగా వాళ్లు పన్నిన కుట్రలు దాచుకునేందుకు ప్రతిపక్షం తమ పేరు మార్చుకుందని విమర్శించారు. ''కొన్ని కంపెనీలు మోసం చేసి.. ఆపై పేర్లు మార్చుకుని మళ్లీ వస్తుంటాయి. అలాగే కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తమ పేర్లను మార్చుకున్నాయి. ఉగ్రవాదం ముందు లొంగిపోయామనే మరకను తొలగించుకునేందుకు తమ పేరును మార్చుకున్నారు. వాళ్ల తీరు.. దేశ శత్రువులను పోలి ఉంది. భారతదేశం అనే పేరు తమ దేశభక్తిని చాటుకోవడానికి కాదు.. దేశాన్ని దోచుకోవాలనే ఉద్దేశ్యంతోనే'' అని ప్రసంగించారాయన. రాజస్థాన్‌కు ఈ ఏడాది చివర్లోనే ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ.. అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపైనా మండిపడ్డారు. ఓవైపు కేంద్రం యువతను ముందుకు తీసుకెళ్లాలని చూస్తోంది. కానీ, రాజస్థాన్లో ఏం జరుగుతోంది?. పేపర్ లీక్ల వ్యవస్థ నడుస్తోంది. సమర్థవంతమైన యువత భవిష్యత్తును ఇక్కడి ప్రభుత్వం సర్వనాశనం చేస్తోంది అని మండిపడ్డారాయన.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం నిండు ప్రాణం బలి

(మొదటిపేజీ తరువాయి)

వేయి స్థంభాల గుడి ఏరియాలో నివాసముంటున్న ఊట్ల ప్రేమ్‌సాగర్ ఉదయం పాల ప్యాకెట్ తీసుకురావడానికి కిరణ జనరల్ స్టోర్ కి వెళ్ళాడు తీవ్రంగా పడుతున్న వర్షాలకు మెయిన్ రోడ్డులో ఉన్న విద్యుత్ వైర్లు తెగి రోడ్డు మీద పడి ఉండడాన్ని గమనించని ప్రేమ్‌సాగర్ విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ అధికారులు తక్షణమే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తే నిండు ప్రాణం పోయేదికాదని స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్ర దు:ఖంతో అన్నారు. మతునికి భార్య, 7 సంవత్సరా

పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

- ప్రమాదకర స్థాయిలో నీటి ప్రవాహం
- అప్రమత్తం చేస్తున్న పోలీసులు

నంగునూరు, జూలై 27, మనం న్యూస్: గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని అక్కనపల్లి, ఖాతా, ఘనపూర్ చెక్‌డ్యామ్‌లు పూర్తిగా నిండి అక్కనపల్లి పెద్దవాగు ఉధృతంగా ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుంది. అదేవిధంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని చెరువులు పూర్తి స్థాయిలో నిండి నిండుకుండలా మారాయి. కొన్ని చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. అక్కనపల్లి పెద్దవాగు బ్రిడ్జిపై నుండి ప్రవహించడంతో వాగు అవతలి ఐదు గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. అక్కనపల్లి పెద్ద వాగును మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎంఆర్‌ఓ , రాజ్‌గోపాల్‌పేట ఎస్ఐ రాజు గౌడ్ తన సిబ్బందితో కలిసి పరిశీలించి వాగు అవతలి గ్రామాల వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో రోడ్లపై నీరు ప్రవహించడంతో బావుల వద్దకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చమురు పంటల సాగులోనూ కేంద్రం వివక్షే !

- తెలంగాణాకు నిధుల విడుదలలో చిన్న చూపు
- ఆయిల్ సీడ్స్‌కు నిధులేవి ?
- కేంద్రం ప్రోత్సాహకాలేవి?
- ఇలా అయితే స్వయం సమృద్ధి ఎలా సాధ్యం ?
- కేంద్రాన్ని లిఖిత పూర్వకంగా ప్రశ్నించిన నామ నాగేశ్వరరావు

ఖమ్మం, జూలై 27(మనం బ్యూరో) : చమురు, ఆయిల్ ఫామ్ విత్తనాలు ఉత్పత్తికి సంబంధించి నిధులు విడుదలలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణా పట్ల తీవ్ర వివక్ష చూపిస్తోందని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు లోక్ సభలో లిఖితపూర్వకంగా కేంద్రాన్ని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో రాష్ట్రానికి విడుదల చేసిన నిధుల వివరాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోందని అన్నారు. తెలంగాణా ప్రభుత్వం రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందన్నారు. కానీ కేంద్రం వివక్ష చూపిస్తూ నిధులు సక్రమంగా కేటాయించకుండా ఇబ్బంది పెడుతున్నారని నామ ధ్వజమెత్తారు. దేశం స్వయం సమృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇందుకోసం ఉద్దేశించిన వివిధ పథకాల స్థితిని వివరించడంతో పాటు దిగుమతి భారాన్ని తగ్గించడానికి తీసుకున్న చర్యలేమిటని పేర్కొన్నారు. పామాయిల్, ఇతర ఆయిల్ పంటల సాగు విస్తీర్ణాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని కోరారు. ఆయిల్ పామ్ , ఇతర తినదగిన నూనె పంటలు పథకాలకు గత ఐదు సంవత్సరాలలో కేటాయించిన, వినియోగించిన నిధుల వివరాలు వెల్లడించాలని కేంద్రాన్ని కోరారు. భారతదేశం ఎడిబుల్ ఆయిల్, నూనె గింజలను ఎగుమతి చేసే దేశ స్థాయికి ఎప్పుడు ఎదుగుతుందని ప్రశ్నించారు. ఆయిల్ సీడ్స్, ఆయిల్ ఫామ్ ప్రాయోజిత పథకాల నిధుల కేటాయింపునకు సంబంధించి కేంద్రం తెలంగాణా పట్ల తీవ్ర వివక్ష కనబరుస్తుందని అన్నారు.2018 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రానికి కేటాయించి, విడుదల చేసిన నిధుల్లో తీవ్ర వివక్ష చూపించారని పేర్కొన్నారు. 2022-23 లో ఆయిల్ సీడ్స్‌కు సంబంధించి పైసా ఇవ్వలేదని నామ ఆక్షేపించారు. ఎన్ఎఫ్ఎస్ఎం , ఎన్ఎంఇఓ ఆయిల్ సీడ్స్, ఆయిల్ ఫామ్ పథకాలకు సంబంధించి తెలంగాణా లో 2018 - 19లో రూ 1000 ..00 లక్షలు కేటాయించి, కేవలం 250. లక్షలు మాత్రమే విడుదల చేశారన్నారు. అలాగే 2019 -20లో రూ.1199.70 లక్షల కేటాయింపునకు గాను రూ.513.10 లక్షలు విడుదల చేశారు. 2020-21లో రూ 1310 లక్షలకు 180.59 లక్షలు విడుదల చేశారు.2021 -22 లో రూ.2342. 20 లక్షలకు గాను కేవలం రూ.700.73 లక్షలు విడుదల చేయగా, 2022 - 23లో పైసా ఇవ్వలేదని చెప్పారు. ఆయిల్ ఫామ్ కు సంబంధించి 2022 - 23లో రూ.28,528 లక్షలకు గాను రూ.10743.50 లక్షలు విడుదల చేశారని చెప్పారు. గుజరాత్ కు ఆయిల్ సీడ్స్ కు సంబంధించి రూ.3251.50 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. మిగతా రాష్ట్రాలకు భారీ కేటాయింపులు చేసి, నిధులు విడుదల చేసి, తెలంగాణా రాష్ట్రాన్ని విస్మరించారని నామ అన్నారు.కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేందర్ సింగ్ తోమర్ సమాధానం ఇస్తూ చమురు విత్తనాల ఉత్పత్తికి సంబంధించి కేంద్రం జాతీయ ప్రాయోజిత పథకం 'ఎన్ఎఫ్ ఎస్ఎం - ఓఎస్ ' పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఉత్పాదకతను పెంచి, దిగుమతి తగ్గించడం, తద్వారా స్వయం సమృద్ధిని సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి చెప్పుకొచ్చారు.

ఇదేమి తీరు..

- విద్యార్థుల భవిష్యత్తుపై బాధ్యతేది
- అరకొర సౌకర్యాలు... అపరిశుభ్రత వాతావరణం..
- ఎంపీటీసీలు వేముల భారతి, సత్యవరపు తిరుమల
- గురుకుల పాఠశాలను సందర్శించిన ప్రజా ప్రతినిధులు

అశ్వారావుపేట, జూలై 27, (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు లక్షలు ఖర్చు చేస్తున్నాం అని చెబుతూ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని ఎంపీటీసీలు వేముల భారతి, సత్యవరపు తిరుమల మండిపడ్డారు. గురువారం పట్టణంలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి వారిని వివరాలు అడగగా తమ బాధలు చెప్పుకున్నారు. ఆహారం సరిగా ఉండటం లేదని, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో దోమల ఎక్కువగా ఉంటున్నాయని, అనారోగ్యం బారిన పడుతున్నామని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై స్పందించిన ప్రజాప్రతినిధులు వంటగది, పాఠశాల పరిశారాలను పరిశీలించగా విద్యార్థులు చెప్పిన విషయాలను నిజమేనని గ్రహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం నీరు నిల్వ ఉండటం వల్ల అనేక అంటూ రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులు ప్రభుత్వం ఏం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు అవస్థలు చూసేందుకు ఒకసారి ఈ పాఠశాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మహిళ నాయకులు మరియమ్మ, రమాదేవి ,నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే మోడీ ప్రభుత్వ ధ్యేయం

- కిసాన్ సమృద్ధి కేంద్రాలతో రైతులకు మరింత లాభం
- ఎరువులపై కేంద్రం భారీ సబ్సిడీ
- బీజేపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, జూలై 27, మనం న్యూస్: రైతు శ్రేయస్సే ధ్యేయంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ మీటింగ్‌ను పట్టణలోని గణేష్ ట్రేడర్స్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 1 లక్ష 25 వేల కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రధాని ఆవిష్కరించి జాతికి అంకితం చేయడం దేశానికే గర్వకారణమన్నారు. కిసాన్ సమృద్ధి కేంద్రాలు రైతు సేవా కేంద్రాలని, వీటి ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు లభిస్తాయన్నారు. రైతులకు అవసరమైన పనిముట్లు, ఎరువులు, విత్తనాలు ఒకే దగ్గర లభిస్తాయని తెలిపారు. భూసార పరీక్షలు, సీడ్ పరీక్షలు నిర్వహించి రైతులు ఏ రకం పంటలు వేయాలో, ఎటువంటి ఎరువులు వినియోగించాలో ఈ రైతు సేవా కేంద్రాలు తెలియజేస్తాయన్నారు. 17 వేల కోట్లు కిసాన్ సమ్మాన్ నిధులు ప్రధాని విడుదల చేశారని, రాష్ట్రంలో 21 లక్షల మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ఎరువులు, విత్తనాలపై కేంద్రం భారీ సబ్సిడీ భరిస్తూ రైతులకు తక్కువ ధరకే అందిస్తుందన్నారు. సుమారుగా రైతు ఒక సంవత్సరానికి రెండు పంటలు పండిస్తే ఎకరాకు కేంద్రం రూ. 19 వేలు సబ్సిడీ భరిస్తుందని వివరించారు. వీటితోపాటు కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతుకు రూ. 6 వేల పెట్టుబడి సాయం కేంద్రం అందిస్తుందన్నారు. కావున రైతులు కిసాన్ సమృద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు విద్యాసాగర్, రాంచంద్రరావు, ఉపేందర్‌రావు, శివకుమార్, నరసింహా రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, యాదమల్లు, బైరి శంకర్, శ్రీనివాస్, అరుణరెడ్డి, పద్మ, సుగుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన పొంగిపొర్లుతున్న వాగులు

- వీరన్నపేటలో భారీ వర్షానికి కూలిన ఇల్లు

చేర్యాల, జూలై 27, మనం న్యూస్: రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చేర్యాల మండలంలోని ఆకునూరు, పెద్దవాగు, పల్లె వాగు, వేచరేణి, చిట్యాలతోపాటు అన్ని గ్రామాల్లో వాగు ల్లోకి నీరు చేరి నిండుకుండలా మారి వాగులు పొంగిపొర్లుతున్నాయి. ముత్యాల తాళ్ల చెరువు, జక్కుల చెరువు రెండు చెరువుల నుండి మత్తడి పారుతుంది. అదేవిధంగా పోతిరెడ్డిపల్లి గ్రామంలో కాలువకు గండి పడడంతో భారీగా నీరు ప్రవహిస్తుండడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా చేర్యాల జనగామ రోడ్డు వీరన్నపేట క్రాస్ వద్ద భారీ గండి పడడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా పంట పొలాల్లోకి విపరీతంగా నీరు చేరడంతో పంటపొలాలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా వీరన్నపేట గ్రామానికి చెందిన బింగి పోచమ్మ ఇల్లు కూలిపోయింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని సర్పంచ్ కొండపాక బిక్షపతి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పరవళ్లు తొక్కుతున్న కూడవెల్లి చెక్ డ్యామ్‌లు

- నిండు కుండలా మారిన చెరువులు, కుంటలు

తొగుట, జూలై 27, మనం న్యూస్: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తొగుట మండలంలోని వాగు గడ్డ వద్ద కూడవెల్లి వాగు నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతుంది. మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెరువులు నిండడంతో ఎల్లారెడ్డిపేట సమీపంలో రోడ్డుపై నుండి నీరు వెళ్తుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగంపేట గ్రామంలో పటేల్ చెరువు నిండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాహనారులు రోడ్డుపై వెళ్లేటపుపడు జాగ్రత్తగా వెళ్లాలని, చెరు వులు అలుగు పారుతున్నందున ఆ ప్రదేశాలకు వెళ్లినపుడు లోతైన ప్రదేశం వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచి స్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు వరినాట్లు వేయ డానికి సంతోషం వ్యక్తం చేస్తుండగా మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలకు కొంత మేర నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పురాతన పెంకుటిళ్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో ఉండడం శ్రేయస్కరం కాదని అధికారులు సూచించారు.

వరద బాధితులని పరామర్శించిన ఎమ్మెల్యే పాదేం వీరయ్య

భద్రాచలం, జూలై 27, (మనం న్యూస్): దుమ్ముగూడెం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఏ పాదెం వీరయ్య గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సున్నం బట్టి మాల కాశీనగరం గ్రామాలకు సంబంధించిన ముంపు వాసులను ఆశ్రమ పాఠశాలకు తరలించగా, వారికి అందుతున్న వసతులను, అడిగి తెలుసుకుని పరామర్శించారు. రెవిన్యూ ,పంచాయతీ, ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయంతో పని చేయాలని, సీజనల్ వ్యాధులు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సందర్భంలో మరపడవలో ప్రయాణం చేస్తూ సున్నంబట్టి గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతిర్యాల రవికుమార్, దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంక శ్రీనివాసరావు, శివ, ఉబ్బ వేణు, కోడి చంటి, గుమ్మడి శ్రీను తదితరుల కార్యకర్తలు నాయకులు పాల్గొనడం జరిగింది.

దళిత హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా రొడ్డ చరణ్

బెజ్జంకి, జూలై 27, మనం న్యూస్: దళిత హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులుగా రొడ్డ చరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల అధ్యక్షులుగా దొంతరవేణి మహేష్ రొడ్డ చరణ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రొడ్డ చరణ్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఎంతో కాలంగా అణచివేతకు గురవుతున్న దళితుల అభ్యున్నతి కోసం ఎప్పటి కప్పుడు వారి హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తూ హక్కుల సాధనే లక్ష్యంగా ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి రూపేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బోనగిరి శ్రవణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

కొండపాక, జూలై 27, మనం న్యూస్: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఆయుర్వేద వైద్యాధికారిణి డా. రజిని తెలిపారు. గురువారం మండలంలోని వెలికట్ట గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాల వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఔషధ మొక్కలతో చిన్న చిన్న చిట్కాలు పాటించి వ్యాధులను నయం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో 132 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది శివ, సంధ్య తదితరులు ఉన్నారు.

రైతుబీమాకు నమోదు చేసుకోవాలి

- గజ్వేల్ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్

కొండపాక, జూలై 27, మనం న్యూస్: రైతుబీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ గజ్వేల్ డివిజన్ సహాయ సంచాలకులు బాబు నాయక్ రైతులకు సూచించారు. గురువారం కుకునూరుపల్లిలో బీమా నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేసి, రైతుబీమాకు నమోదు చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంత వరకు నమోదు చేసుకోని వారి పేర్ల జాబితాను గ్రామపం చాయతీ వద్ద ఉంచారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీ కాలనీ చుట్టూ వరద నీరు

- కిన్నెరసాని అధికారుల మొండి వైఖరి

బూర్గంపహాడ్, జూలై 27 (మనం న్యూస్): కిన్నెరసాని ప్రాజెక్టు అధికారులు ఒక్కసారిగా 12 గేట్లు ఎత్తడంతో బూర్గంపహాడ్ గ్రామంలో ఎస్.సి. కాలనినీ, కోల్లు చెరువుని వరద నీరు చుట్టుముట్టింది. ఒక్కసారిగా భయాందోళనతో లబోదిబోమంటూ ప్రజలు బయటకు వచ్చారు. తహశీల్దార్ భగవాన్ రెడ్డి ప్రజలకు ధైర్యం చెప్పారు. లోతట్టు ప్రాంత ప్రజలను ఎంపిఓ సునీల్, స్థానిక సర్పంచ్ స్వప్న అప్రమత్తం చేశారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో నిండుకుండలా నిండిన చెరువులు

- ఉప్పొంగిన చెరువులు కాలువలు
- మల్లన్న గండి జలకల గేట్లు ఎత్తేసిన అధికారులు
- స్టేషన్ ఘన్పూర్ పెద్ద చెరువు జలకళ
- స్టేషన్ ఘన్పూర్ జాతీయ రహదారిని ముంచెత్తిన వరదలు
- ఏసీపీ, సీఐ పోలీసుల ముందు జాగ్రత్త చర్యలు
- మండలాన్ని అప్రమత్తం చేసిన తహసిల్దార్

స్టేషన్ ఘన్పూర్, జూలై 27, మనం న్యూస్ : స్టేషన్ ఘన్పూర్ మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలలో ఎక్కడ చూసినా నీటిమయం కొన్నిచోట్ల రహదారులన్నీ మూసి పోయాయి నెమలిగొండ గ్రామం వద్ద గ్రామస్తులకు కొంత ఇబ్బందులు కలిగాయి అదేవిధంగా కొత్తపెల్లి మీదుగా తాటికొండ గ్రామానికి వెళ్లాల్సిన వారికి కూడా భారీ వర్షం రావడంతో కొంత ఇబ్బంది కలిగాయి చెరువులన్నీ నిండిపోయాయి కాలువలన్ని పరుగులు తీస్తున్నాయి మల్లన్న గండి జలకల కావడంతో రెండు గేట్లను ఎత్తి నీటిని వదిలేశారు. ఇక స్టేషన్ ఘన్పూర్ పెద్ద చెరువు మత్తడి పోయడానికి సిద్ధంగా ఉంది స్టేషన్ ఘన్పూర్ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో హైదరాబాదు హనుమకొండ వైపు వెళ్లాల్సిన వాహనాలకు కొంత ఇబ్బందులు కలిగాయి దీంతో స్థానిక ఏసిపి రఘుచందర్, సిఐ రాఘవేందర్, ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది అప్రమత్తమై వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూశారు. జెసిబి ల సహాయముతో నీటిని నిలవ లేకుండా చూశారు. స్థానిక తాహసిల్దార్ పూల్ సింగ్ చౌహాన్ గ్రామాలలోని అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూశారు. అదేవిధంగా గ్రామాలలో ఉన్న సర్పంచులు ఎంపీటీసీ లు కూడా గ్రామాలకు ఎటువంటి ముప్పు కలగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పడుతూ స్థానిక అధికారులకు తెలియజేశారు. రాత్రి వేళలో కరెంటు కోతలు ఏర్పడ్డాయి. పాతకాలమునాటి పూరీ ఇండ్లు కూడా కొన్ని నేలమట్టమయ్యాయి రేకులు తడకలు గుడిసెలు కొన్ని చోట్ల నేలకోరిగాయి. ఇంతకాలం వానలు పడతాయి అని ఎదురుచూస్తున్న ప్రజలకు ఒక్కసారిగా మూడు నాలుగు రోజులుగా వర్షాలు పడటంతో దిక్కు తోచని స్థితిలో పడ్డారు ఒక మాటలో చెప్పాలంటే వర్షాలు ఎప్పుడూ తగ్గుతాయా అంటూ ఎదురు చూశారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాఠశాలలన్నీ మూతపడటంతో కూడా ఎటువంటి ఇబ్బందులు కలగలేదు ఏది ఏమైనా గ్రామాలలో ఎటువంటి అవాంఛ సంఘటనలు జరగకపోవడం పెద్ద ఎత్తున మబ్బు జరగక పోవడం అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నీట మునిగిన ఇండ్లను పరిశీలించిన తహసీల్దార్ పార్వంది శ్రీనివాస్

నర్మెట్ట, జూలై 27, మనం న్యూస్ : గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రానికి చెందిన మారబోయిన ఐలయ్య సిద్ధులు మంద మొండయ్య ఇండ్లలో బుధవారం రాత్రి ఇండ్లు నీట మునిగాయి నీట మునిగిన కొన్ని ఇండ్లు నేలమట్టమయిన ఇండ్లను తహసిల్దార్ ఎంపిడిఓ ఖాజా మొయినుద్దీన్ పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక సమర్పిస్తామని నష్టపరిహారం వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐబీఏఈ ఈ సుకన్య, ఎమ్మార్వై సాయిబాబా, పంచాయతీ కార్యదర్శి కానుగంటి సుభేష్, వార్డు సభ్యులు ముక్కెర మహేందర్, పొన్నం బాలకష్ణ, కన్నెబోయిన కుమార్, వీఆర్ఏ లు నక్కల కర్ణాకర్, భూక్య లింగం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కేవీపీఎస్

కాటారం, జూలై 26, మనం న్యూస్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కుల వివక్ష పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ బుధవారం అన్నారు. ఈ మేరకు ఆయన కాటారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, సమ్మెను విరమింపజేయాలని అన్నారు. రాష్ట్రంలో, మండలంలో ఎక్కడ చూసినా ఎక్కడ వేసిన చెత్త అక్కడే పేరుకు పోయిందని వర్షాకాలం కావడంతో రోగాలు ప్రబలే అవకాశం ఉన్నం దున, తక్షణమే ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్య లు పరిష్కరించి, సమ్మెను విరమింప చేయాలన్నారు. అలాగే వారి న్యాయ మైన 14 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్డీఓ, ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

స్టేషన్ ఘన్పూర్, జూలై 27, మనం న్యూస్ : హన్మకొండలో నూతన ఆర్డీఓ రమేష్‌ని, కాజీపేట ఏసిపి డేవిడ్ రాజుని వారు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి పూల మొక్క అందించిన వరంగల్ వెస్ట్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలిపాక సతీష్. ఈ సందర్భంగా తొలిప్రేకర్ సతీష్ మాట్లాడుతూ గతంలో స్టేషన్ ఘన్పూర్ నియోజక వర్గ కేంద్రంలో అధికారులుగా పని చేశారని ప్రజల మన్ననలు పొందారని అందుకోసం ఇవ్వాలని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశామని సతీష్ తెలిపారు. ప్రజలకు మంచి కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు ఎక్కడున్నా కలిసి వారిని అభినందించడం మంచి సంస్కారమని వారు కొనియా డారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె రాహుల్ రెడ్డి, ఉద్యమ కారుల సంఘం ఘనపూర్ నియోజక వర్గం ఇంచార్జీ గుర్రం ఫాతి కుమార్, సురేష్ తదతరులు పాల్గొన్నారు.

మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాటారం, జూలై 27, మనం న్యూస్ : మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాటారం సిఐ పొన్నమనేని రంజిత్ రావు గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్ఎండి డ్యాం పూర్తిగా నిండిపోయి నిండుకుండలా మారిందని, భారీ నీటి పారుదల శాఖ అధికారులు ఎల్ఎండి డ్యాం గేట్లు ఎత్తివేయనున్నారని, మానేరు పరివాహక ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. మండలంలోని చెరువులు చెక్ డ్యాములు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నిండుకుండలా మారాయని, ప్రజలు చేపల వేటకు వెళ్లారాదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కు ఫోన్ చేసి సహాయం పొందాలని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి సాయం అందించాలి

గీసుగొండ, జూలై 27, మనం న్యూస్: గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తెలంగాణలో ప్రజా జీవనం అస్తవ్యస్తం అయిందని ముఖ్యంగా దళితులు చాలా ఇబ్బందులు పడుతున్నారని (ఎమ్మార్పీఎస్ టిఎస్) వరంగల్ జిల్లా అధ్యక్షులు దళిత రత్న నమిండ్ల చిన్నస్వామి గీసుగొండ మండలం గొర్రెకుంట గ్రామం 15 వ డివిజన్ ఎస్సీ దళిత వాడలో చిన్నస్వామి మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా చాలా ఇల్లు నేలమట్టమయ్యాయి వారికి సొంత స్థలములో ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల ఆర్థిక సహాయం అందించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా వానలతో నిరాశ్రులైనవారికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని 2020 సంవత్సరంలో హైదరాబాదు లో వర్షాలకు నిరాశ్రయమయిన వారికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేశారని అప్పట్లో రాజకీయ ప్రతిపక్షాలు జిహెచ్ఎంసి ఎన్నికల కోసం ఆర్థిక సహాయం చేస్తున్నారని గగ్గోలు పెట్టాయి అని అది నిజం కాదు అంటే ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది నిరాశ్యులైన వారికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రతినిత్యం అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్
- అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దు
- వరద ఉధృతిని పర్యవేక్షించిన మంత్రి

భద్రాచలం, జూలై 27,(మనం న్యూస్): జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులకు పలు ఆదేశాలు ఇస్తున్నారు. ప్రకృతి వైపరిత్యాలు అడ్డుకోలేం కానీ నష్టాన్ని నివారించగలం అంటూ జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయి అధికా రులను సైతం ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ ప్రాణనష్టం జరగకుండా పరిస్థితులు చక్కదిద్దాలని అధికా రులను ఆదేశించారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు ఒక పక్క, వివిధ ప్రాజెక్టులు నుండి వస్తున్న ఇన్ ఫ్లో తో భద్రాచలం వద్ద గోదావరికి వరద పోటెత్తిందని మంత్రి అన్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, పంచాయితీ రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, వైద్య శాఖల అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందిని నిత్యం అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులు, జాలర్లు చేపల వేటకు వెళ్ళొద్దని సూచించారు. ప్రజలు బయటకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలని జిల్లా ఎస్పీ వినీత్ ను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్, ఇరిగేషన్ అధికారులందరు ముంపు ప్రాంతాల్లోనే ఉండి పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలంలో ప్రస్తుతం కొనసాగుతున్న పునరావాస కేంద్రాలకు అదనంగా పరిస్థితిలను బట్టి అదనపు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సన్నద్ధంగా ఉందని చెప్పారు. ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, అందుకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల, వరద సహాయక చర్యల ప్రత్యేక అధికారి అనుదీప్, ఐటిడిఎ పిఓ ప్రతీక్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

సమరానికి సై అన్న కేయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు

- కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్ట్ మహిళ అధ్యాపకుల సమర దీక్ష

కేయూ, జూలై 27, మనం న్యూస్ : కాకతీయ యూనివర్సిటీ లో కాంట్రాక్ట్ అధ్యాపకులు గత 20 సంవత్సరాల నుండి పనిచేస్తూ ముఖ్యమంత్రి హామీ ప్రకారము తెలంగాణ రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి ఉన్నారు అదేవిధంగా గత సంవత్సరం వరంగల్లో వరదలు వచ్చి పర్యటించి నప్పుడు యునివర్సిటీలోని కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినారు కాని జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజీలోని అధ్యాప కులను మాత్రమే రెగ్యులరైజ్ చేసినారు. యూనివర్సిటీలలోని అధ్యాప కులను ఇప్పటివరకు రెగ్యులరైస్ చేయలేదు. దీనికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన అధికారులు సహకరించట్లేదు. కావున తెలంగాణ స్టేట్ యూని వర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నేటి నుండి కాకతీయ యూనివర్సిటీలోనీ మహిళా కాంట్రాక్ట్ అధ్యాపకుల సారధ్యంలో యూనివర్సిటీ క్యాంపస్‌లో టెంటు వేసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు ఈ దీక్షల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా ఆకుట్ మాజీ అధ్యక్షులు విశ్రాంత ఆచార్యులు మండ సారంగపాణి గౌడ్ విచ్చేసి మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి కాంట్రాక్టు పద్ధతి పై పని చేస్తున్న మీమ్మల్ని ప్రభుత్వం రెగ్యులర్ చేయడం అనేది చాలా న్యాయమైన డిమాండ్ అని తెలుపుతూ, రాష్ట్రంలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరినీ రెగ్యులరైస్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. సాయంత్రం ఐదు గంటలకు కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ పి కరుణాకర్ రావు, రాష్ట్ర జాక్ కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్ నిమ్మరసం ద్వారా దీక్షలు విరమింపజేసి మాట్లాడుతూ గత రెండు నెలలుగా వివిధ రకాలుగా ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధుల ద్వారా వినతి పత్రాలు ఇస్తూ మమ్మల్ని రెగ్యులరైస్ చేయండి అని వేడుకున్నాము కానీ ప్రభుత్వము నుండి ఎటువంటి స్పందన లేదు కాబట్టి తప్పనిసరిగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటిలో టెంటు వేసి రిలే నిరాహార దీక్షలు చేస్తూ నిరసన తెలియజేయడానికి పూనుకున్నాము కావున ఇప్పటికైనా ప్రభుత్వము మా యందు సానుకూలంగా ఆలోచిస్తూ రెగ్యులరైజ్ చేయాలని కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో ఈ రాజేశ్వరి, డాక్టర్ సునీత, డాక్టర్ మంజుల, డాక్టర్ రాధిక, డాక్టర్ బి రమాదేవి , డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ వందన, డాక్టర్ మంతిని శంకర్, డాక్టర్ డి బిక్షపతి, డాక్టర్ ఆరూరి సూర్యం, డాక్టర్ గజ్జల మల్లేష్, డాక్టర్ ఓ రవీందర్, డాక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు, డాక్టర్ సత్య జూల, డాక్టర్ ఏ కొమురయ్య, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ బి వెంకట గోపీనాథ్, డాక్టర్ కే సాయి శరణ్, జేఎన్టీయూ జగిత్యాల యూనివర్సిటీ నుండి టి వెంకటేష్ ఈ దీక్షలకు సంఘీభావం తెలిపారు 30 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో మల్హార్ గ్రామాలు

- ఉగ్రరూపం దాల్చిన మానేరు..
- మానేరు ఉధృతికి కొట్టుకపోయిన బోర్లు
- రికార్డ్ స్థాయిలో వరదలు
- భారీ వర్షాలకు వణికిపోయిన పల్లెలు

మల్హార్, జూలై 27, మనం న్యూస్: భారీ వర్షాలకు మల్హార్ మండలం జలదిగ్బంధమైంది. మండలంలోని మల్లారం, చిన్నతూండ్ల, దుబ్బపేట, రావులపల్లి, అడ్వాలపల్లి, పివి నగర్, వల్లెంకుంట, కుంభంపల్లి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు రిస్క్ టీంతో సహాయక చర్యలు చేపట్టారు. మానేరు ఉధతంగా ప్రవహించడంతో కొయ్యూరు సమీపంలో పివి నగర్, అడవి సోమన్‌పల్లి మధ్యలోని మానేరు బ్రిడ్జిపై రాకపోకలను నిషేధించారు. దీంతో భూపాలపల్లి పెద్దపల్లి జిల్లాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షాలకు అన్సాన్‌పల్లి వద్ద రోడ్డు కొట్టుకొని పోయింది. శాత్రాజ్ పల్లిలోని పలువురి ఇండ్లు నేలమట్టమయ్యాయి. ఆరెవాగు ఉదతంగా పొంగడంతో తాడిచెర్ల, మల్లారం చిన్న తూండ్ల, అడువాలపల్లి, పెద్ద తూండ్ల, రావులపల్లి, దుబ్బపేట మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచి పోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుంభంపల్లి, తాడిచెర్ల, మల్లారం, పివి నగర్, వల్లెంకుంట మానేరులో వ్యవసాయ మోటర్లు, పైపులు వరద ఉధతికి కొట్టుకొనిపోయారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెవిన్యూ అధికారులు, పోలీసులు, పలు రాజకీయ నాయకులు సమస్యాత్మక ప్రాంతాలను పర్యటించారు.

జీవన్గి శ్రీ మహాదేవ లింగేశ్వర దేవస్థానం చుట్టు ప్రవహిస్తున్న కాగ్ని నది

బషీరాబాద్, జూలై 25, మనం న్యూస్: అతి పురాతమైన దేవస్థానం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల్ గ్రామం జీవన్గి కాగ్న నది ఒడ్డున వెలిసిన శ్రీ మహాదేవ లింగేశ్వర దేవాలయం భారీ వర్షాలతో కురుస్తున్న ఎంత ఉధృతంగా ఎగువ నుండి వస్తున్న వరద తాకిడికి దేవాలయం చెక్కు చెదరకుండా అదేవిధంగా ఉంటుంది గర్భగుడిలో శివలింగం ఎదురుగా బసవన్న ఆ వరద ఉధృతానికి ఆ నీటి ప్రవాహానికి ఇటువంటి హాని జరగలేదు గుడి నల్ల గుర్రాల వరకు నీరు ప్రవహించిన దేవాలయం కు చెక్కుచెదరకుండా ఎటువంటి అపాయం జరగలేదు ఇంతవరకు అది ఆ శివుని మహత్యము అని గ్రామస్తులు ఈ విధంగా అనుకుంటున్నారు ప్రతి సంవత్సరం మహాశివరాత్రికి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతూ ఉంటాయి శివుని ఆజ్ఞ లేనిది చీమైన కుట్టదని ఇక్కడ శ్రీ మహాదేవలింగేశ్వరుని దేవాలయానికి శివుని ఆజ్ఞ ఉన్నందువలన గుడి పైనుంచి ఎంత వరద ప్రభావం వచ్చినా ఏమి చేయలేవని గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు ఈ విధంగానే అనుకుంటున్నారు.

శాసనసభ ఎన్నికల్లో బీసీల ఐక్యత చాటే సమయం ఆసన్నమైంది

- శాసనసభ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు 60 సీట్లు కేటాయించాలి
- చట్టసభల్లో 50% రిజర్వేషన్లపై ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ఉద్యమిద్దాం
- తాండూర్ మీడియా సమావేశంలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్ కందుకూరి

తాండూర్, జూలై 27, మనం న్యూస్: బీసీలు కేవలం ఓటు బ్యాంకు కి పరిమితం అయ్యారు ఇకనుండి చట్టసభలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి తదితరుల పార్టీలు బీసీలకు సముచిత స్థానం ఇవ్వాలి ఈరోజు ఉదయం మీడియా సమావేశం నందు రాజ్ కుమార్ అన్నారు రాజ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు శాతం ఉన్న రెడ్డిలు 40 అసెంబ్లీ స్థానాల్లో ఉన్నారు 1 శాతం ఉన్న వెలమలు 10 అసెంబ్లీ స్థానల్లో ఉన్నారు. మరి 60 శాతం ఉన్న బీసీలు కేవలం 22స్థానాలో ఉండడం ఎంతవరకు సమంజసం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి బిఆర్ఎస్ కాంగ్రెస్ బిజెపి తదితర పార్టీలు కచ్చితంగా 60అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి లేకపోతే రాబోయే రోజుల్లో బీసీల సత్తా ఏంటో చూపెడతాం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి బీసీ బందు కేవలం 15 కులాలకు మాత్రమే చెందడం సబబు కాదు ఎందుకంటే బీసీ సామాజిక వర్గంలో 137 కులాలు ఉన్నాయి అది గ్రహించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలి అలాగే మైనార్టీలకు మైనార్టీ బంద్ ఇవ్వడం బీసీ సంఘం సాధారణంగా స్వాగతం పలుకుతుంది తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పలు సామాజిక వర్గాల గురించి ఎన్నో సభలో మాట్లాడారు మరి మీకు మా బీసీలు గుర్తుకు రాలేరా మా బీసీలాంటి ఎందుకు అంత చిన్న చూపు అది మీరు తెలుసుకోవాలి ముఖ్యంగా తాండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బీసీ సమీకృత భవనం కేటాయించాలని పలు దఫాలుగా చెప్పడం జరిగింది దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం జరిగింది త్వరలో అట్టి పనులను పూర్తి చేయాలని ఈ సభాముఖంగా తెలపడం జరిగింది. అలాగే పార్లమెంట్ సెగ్మెంట్లో ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను కచ్చితంగా బీసీ జనాభా ప్రాతిపదికన తాండూర్ పరిగి అసెంబ్లీ స్థానం కచ్చితంగా బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు గత దశాబ్దాల పాటు సేవలందించిన మహారాజుల కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలి బిజెపి పార్టీ బలోపేతానికి కృషిచేసిన బీసీ నాయకున్నికే తాండూర్ టికెట్ ఇవ్వాలి టిఆర్ఎస్ పార్టీ టికెట్ కూడా తాండూరు గడ్డపై పుట్టి పెరిగిన బీసీ నాయకునికి కేటాయించాలని డిమాండ్ చేశారు మీడియా సమావేశం నందు జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవి లత శ్రీనివాస్ చారి మాట్లాడుతూ బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించినప్పుడే వారి ఉన్నతికి నేను చేసే వారవుతారని అన్నారు వడ్డెర సమాజ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ బోయ వాల్మీకి సమాజం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ లింగాధరి శైవ వీరశైవ సమాజం కార్యదర్శి రవి కుమార్ మాట్లాడుతూ ఎక్కువ జనాభా ఉన్న తాండూర్ కు అన్ని రాజ కీయ పార్టీలు బీసీలకే పార్టీ టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు నాయి బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు పరమేష్ బిసి సంఘం మండ లాల అధ్యక్షులు లక్ష్మణ్ చారి శ్రవణ్ నరేందర్ మాట్లాడుతూ బీసీల

కోసం నిరంతరం పోరాడుతున్న రాజ్ కుమార్ నేతృత్వంలో తాండూర్ బీసీలంతా ఐక్యంగా ఉన్నారని కొంతమంది తమ స్వార్థం కోసం బీసీల ను విడదీస్తున్నారని బీసీ యువకులంతా ఏకమై బీసీ నాయకుడినే గెలి పించుకోవాలని కోరారు అందుకు అన్ని రాజకీయ పార్టీలు 50% పైన బీసీలకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశం నందు బీసీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ శుకుర్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్ చారి, వడ్డే సమాజ అధ్యక్షులు శ్రీనివాస్, వాల్మీకి సమాజం జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్, నాయి బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు పరమేష్, వీరశైవ సమాజ కార్యదర్శి లింగదల్లి రవికుమార్, పట్టణ బీసీ మహిళా అధ్యక్షురాలు నాయి కోడి జ్యోతి, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, మహిళా కార్య దర్శి ఉపాధ్యక్షురాలు అనిత, విజయలక్ష్మి, నరసమ్మ, పెద్దముల్, యాలాల్, బషీరాబాద్ మండలాల అధ్యక్షులు శ్రవణ్, లక్ష్మణాచారి, నరేందర్, కార్యదర్శి రాధాకృష్ణ, మీడియా ఇంచార్జ్ బసవరాజ్, బీసీ యువ నాయకులు రాము ముదిరాజ్, జుంటుపల్లి వెంకట్, హరి, అనిల్, బాలాజీ ఠాకూర్, రాము ముదిరాజ్ నవీన్ సురేష్ అజిత్, రాజు నరసింహ వెంకట్ సురేందర్, మతిన్ మహాదేవ్, నగేష్ పాల్గొన్నారు.

అకాల వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్, జూలై 27, మనం న్యూస్: వికారాబాద్ జిల్లా భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్,ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వికారాబాద్ మండలం గోధుమగూడ గ్రామంలో కూలినటువంటి ఇండ్లను పరిశీలించారు. ఇండ్లు కూలిపోయినటువంటి బాధితులకు ప్రభుత్వం ద్వారా గృహలక్ష్మి పథకంలో ఈ బాధితులకు మొదటి ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు.ప్రమాదకరంగా ప్రవహిస్తున్నటు వంటి వాగులను దాటరాదని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయటికి రావద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్ల నుండి బయటికి వచ్చి గ్రామపంచాయతీ భవనం లేదా పాఠశాల భవనాలలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు

- మండల ప్రజలు హర్షం వ్యక్తం

దౌల్తాబాద్, జూలై 27 (మనం న్యూస్): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు విడుదల చెయ్యడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించాలని ఉత్తర్వులు పేర్కొన్నారని ఇంటర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎన్నో సంవత్సరాల నుంచి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. మండల వాసులు కళాశాల మంజూరు పట్ల ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు అత్యవసరం ఉంటేనే బయటకు రండి

- భారీ వర్షాలు కురుస్తున్నందున వివిధ గ్రామాలను సందర్శించిన తహశీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో రమేష్, ఎస్ఐ వేణు గోపాల్ గౌడ్

బషీరాబాద్, జూలై 27, మనం న్యూస్: బంగాళా ఖాతంలో అల్ప పీడనం ఏర్పడి వివిధ రాష్ట్రాలలో భారీ వర్షం కురవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు తెలంగాణ రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా ఎనిమిది రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో బషీరాబాద్ మండల్ అధికారులు తహసిల్దార్ వెంకటస్వామి ఎంపీడీవో రమేష్ ఎస్సై వేణుగోపాల్ గౌడ్ గురువారం రోజు అతి భారీ నుండి వర్షాలు పడే అవకాశం ఉన్నాయని జీవన్గి శ్రీ మహాదేవ లింగేశ్వర దేవాల ఉధృతంగా ప్రవహిస్తున్న కాగ్న నదిని, బషీరాబాద్ టు గంగ్వార్ కల్వర్టు, టాకి తాండ కల్వర్టు, మర్పల్లి టు జలాల్పూర్ కల్వర్టు నవల్గా చెరువు అలుగును అధికారులు సందర్శించడం జరిగింది ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ గురువారం శుక్రవారం రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపడంతో ప్రజలు అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు వాగులు వాడకలు పొంగిపొర్లుతున్నాయి కాబట్టి పోలీస్ రెవెన్యూ పంచాయతీ విద్యుత్ శాఖ అధికారులు ముందు జాగ్రత్తతో ప్రజా ప్రతినిధులకు ప్రజలతో మాట్లాడడం జరుగుతుందని ప్రమాదకరమైన వాగుల దగ్గర పోలీస్ శాఖ ఇతర శాఖ అధికారులు కలిసి రోడ్లను బ్లాక్ చేసి బందోబస్తు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు చిన్న పిల్లలపై జాగ్రత్త ఉండాలి, పాత ఇండ్లు పాత నిర్మాణ కట్టడాల,కరెంటు స్తంభాల, దగ్గర జాగ్రత్త ఉండాలని ఏదైనా సమస్య ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని దయచేసి ప్రజలు ఎవరు బయటికి రావద్దు అత్యవసరం ఉంటేనే బయటకు రావాలని అన్నారు.

తాండూరులో ప్రజాస్వామ్యం ఉందా?

- ఘనంగా రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద పటేల్ జన్మదిన వేడుకలు

తాండూరు, జూలై 27, మనం న్యూస్: ఎక్కడలేని విధంగా తాండూరులో లా అండ్ ఆర్డర్ సరిగా లేక ఆప్రజాస్వామికం కొనసాగు తుందని, మంత్రులను ముఖ్యమంత్రిని ఎదుర్కొన్న నాకు ఇదేమి కొత్త కాదని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ సంచలన వాఖ్యలను చేశారు. గురువారం రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ జన్మదిన వేడుకలు తాండూరు పట్టణంలో అట్టహాసంగా కొనసాగాయి. ఉదయం పట్టణంలోని భాగివి భద్రేశ్వర దేవాలయంలో జన్మదిన సంద ర్భంగా పూజలు జరుపుకున్న శుభప్రద్ పటేల్ , అనంతరం జన్మదిన వేడుకలను పట్టణంలోని ఏఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. పటేల్ అభిమానులు, బీసీ నాయకులు, కార్యకర్తలు వివిధ సంఘాల ప్రతినిధులు భారీ ఎత్తున హాజరై శుభప్రద్ పటేల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ తాండూరులో లా అండ్ ఆర్డర్ సరిగ్గా లేక ఆప్రజాస్వా మీకం నడుస్తుందని ఘటుగా మాట్లాడారు. తన జన్మదినాన్ని పురస్క రించుకొని తన అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బషీరాబాద్, యాలాల్ మండలలో అలాగే తాండూరు పట్టణ ప్రాంతాలలో కొందరు వ్యక్తులు చించి వేయడం పై మండిపడ్డారు. ఈ విషయం పై ఉన్నతస్థాయి పోలీస్ అధికారులకు వివరించిన కూడా ఇప్పటివరకు చర్యలు తీసుకో లేదని అన్నారు. ఇక్కడ లా అండ్ ఆర్డర్ కొందరి నాయకుల వ్యక్తుల్లో బంది అయిందని అన్నారు. వీటికి తాను ఎప్పుడు భయపడనని తెలం గాణ ఉద్యమ సమయంలోనే కేసీఆర్ పిలుపుతో మంత్రులను, ముఖ్య మంత్రి ని కూడా అడ్డుకొని ఎదిరించిన ఘనత తనదని వివ రించారు. ఇక్కడున్న కొందరు వ్యక్తులు ఓర్వలేక ఇదంతా చేస్తున్నట్లుగా అన్నారు.

ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయడానికి వచ్చానని తన రాజకీయ భవిష్యత్తు అంతా తాండూర్లోనే అని అన్నారు ఇక్కడనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. నిస్వార్థంగా తాండూరు ప్రజల కోసం పనిచేస్తానని ఇప్పటివరకు స్వార్థ ప్రయోజనాల కోసం పని చేయలేనని అన్నారు. కొందరు రాజకీయ పార్టీ నాయకులు ప్రజల నుంచి తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక రాజకీయాలు చేస్తున్నారని, బీసీల మధ్యలో ఉంటూ బీసీలచే ప్రెస్ మీట్ లు ఇప్పిస్తూ ఉన్నారని మండి పడ్డారు. అలాంటి బీసీలు నాయకులు కూడా తన చెంతకు త్వరలోనే చేరుతారని అన్నారు. త్వరలోనే ఈ ప్రాంత అభివృద్ధి కోసం బీసీలను అంతా ఏకం చేసి పోరాటం చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, పటేల్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు ఉపాధ్యాయ విద్యార్థి సంఘాల నాయకులు మరియు పటేల్ అభిమా నులు తదితరులు పాల్గొన్నారు

మలబార్‌లో 'మైన్ డైమండ్ షో' ప్రారంభం

ఎల్బీనగర్, జూలై 27, (మనం న్యూస్): ప్రపంచంలోని బంగారు ఆభరణాల సంస్థల్లో ఒకటైన అతిపెద్దదైన మలబార్ గోల్ అండ్ డైమం డ్స్ దిల్ సుఖ్నగర్ షోరుమ్ లో 'మైన్ డైమండ్ షో' ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు షోరూం హెడ్ రధిష్ కుమార్ తెలిపారు. గురువారం మేనేజింగ్ టీమ్ మెంబర్స్ ఈ విశిష్ట ప్రదర్శనలను కస్టమర్ల శ్రేయోభిలాషులతో కలిసి ప్రారంభించారు. ఈ ప్రదర్శన జూలై 27 నుండి ఆగస్ట్ 1వ తేదీ వరకు జువెల్లరీ కలెక్షన్స్ ఉంటుందని, స్పెషల్ ఆఫర్లు కస్టమర్ లకు డిస్కౌంట్ అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. వివాహ వేడు కలకు అనుకూలంగా ఆభరణాల ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ ప్రద ర్శనలో మార్కెటింగ్ మేనేజర్ నాగరాజు, వినియోగదారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు రాసిన పాత్రికేయులు

- జర్నలిస్టుల పోస్ట్ కార్డు ఉద్యమం
- స్థలాల కేటాయింపుకు జీవో విడుదల చేయాలి

ఎల్బీనగర్, జూలై 27, (మనం న్యూస్): తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆరోగ్య బీమా కార్డును అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే ఐజేయు ఉపాధ్యక్షుడు కటకం సుభాష్ డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఎల్బీనగర్ లో పోస్ట్ కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పలువురు జర్నలిస్టులు ముఖ్యమంత్రి కేసీఆర్కు ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పర్యాయాలు బహిరంగ ప్రకటన చేసినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. సొంత నివాసాలు లేక వేలాదిమంది జర్నలిస్టులు అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని అనారోగ్యంతో ఉన్న పేద జర్నలిస్టులకు ఆరోగ్య బీమా కార్డులను అందజేసి ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పోస్ట్ కార్డు ద్వారా ముఖ్యమంత్రి విజ్ఞప్తి

చేశారు. ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై రాష్ట్ర ప్రభుత్వం కొత్త జీవోను విడుదల చేసి పాత్రికేయులకు న్యాయం చేయాలని పోస్ట్ కార్డులో వివరించారు. జర్నలిస్టుల సమస్యలను వివరిస్తూ రాసిన పోస్ట్ కార్డులను ప్రగతిభవంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ కు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు టి. శ్రీనివాసరావు, బానాల మధుసూదన్, ఎస్.రాజు, గట్ల రవీంద్ర, మట్టా అశోక్ గౌడ్, భగవంతురావు తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్ట్ అలుగును సందర్శించిన ఐజి

వికారాబాద్, జూలై 27, మనం న్యూస్ : తెలంగాణ ఐజి శన్వాజ్ ఖాసీం, వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్, కోటిరెడ్డితో కలిసి గురువారం నాడు ధారూర్ మండల పరిధిలోని కొట్‌పల్లి ప్రాజెక్టు అలుగును పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఉధృత్వంగా ప్రవహిస్తున్న వాగుల వద్దకు ప్రజలు ఎవరు రాకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఎవరు వాగులు, దాటకుండా చూడాలని సూచించారు. ఈ కార్య క్రమంలో వికారాబాద్ డిఎస్పి కోణం, నరసింహులు, వికారాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ధారూర్ ఎస్ఐ,సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండ్లు కూలిన బాధితులకు ఆర్థిక సహాయం

- అందించిన సబితా ఆనంద్ ఫౌండేషన్

వికారాబాద్, జూలై 27, మనం న్యూస్: వికారాబాద్ మండ లం గోధుమగూడ గ్రామంలో వర్షాలతో ఇండ్లు కూలి పోయిన టువంటి కావలి శంకరమ్మ, ఎదురే నర్సమ్మ ఈడిగి, రామచం ద్రయ్య, ప్యాట యాదయ్యలకు సబితా ఆనంద్ ఫౌండేషన్ ద్వారా గ్రామ సర్పంచ్ భర్త సత్యయ్య గౌడ్, ఒక్కొక్కరికి 5000 రూపాయల చొప్పున మొత్తం ఇరవై వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు,ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ అనం తయ్య, గ్రామ అధ్యక్షులు సుభాన్ రెడ్డి, డైరెక్టర్ శివకుమార్,కో ఆప్షన్ సభ్యులు యాదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఆర్ ఎస్టేట్ అధ్యక్షుడిగా రాజు గుప్తా

ఎల్బీనగర్, జూలై 27, (మనం న్యూస్): చైతన్య పురి డివిజన్ ప్రభాత్ నగర్ లోని బిఎంఆర్ ఎస్టేట్ అధ్యక్షునిగా రాజు గుప్తా ఆదివారం నియామక మయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ తన నియామకానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టేట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని అన్నారు. ఎస్టేట్‌లో భద్రత పరంగా ఎలాంటి సమస్య తలెత్తకుండా అందరితో చర్చించి తగు చర్యలు చేపడతానన్నారు. సౌకర్యాల విషయంలో రాజీ లేకుండా అందరికీ అందుబాటులో ఉండే తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ. 10 వేలు నగదు అందజేసిన బీజేపీ మురళీకృష్ణ గౌడ్
- యువ మోర్చ తరపున మరో రూ. 5వేలు

తాండూరు, జూలై 27 మనం న్యూస్ : వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ పరిధిలోని బీజేపీ బూత్ అధ్యక్షుని కుటుంబానికి వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీజేపీ నాయకులు మురళీకృష్ణ గౌడ్ ఆర్థిక సాయం అందించారు. పట్టణంలోని 13 వార్డు బూత్ అధ్యక్షులు వెంకట్ తండ్రి బాలస్వామి అనారోగ్యంతో మృత్యులు.. గురువారం ఈ విషయం తెలుసుకున్న మురళీకృష్ణ గౌడ్ రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈసాయాన్ని మురళీకృష్ణ గౌడ్ అదేశాల మేరకు పార్టీ నాయకులు బూత్ అధ్యక్షుని ఇంటికి వెళ్లి అందజేశారు. అదేవి ధంగా బీజేపీ యువమోర్చ తరపున మరో రూ. 5వేలను జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్, పట్టణ బీజేవైఎం అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ స్పోర్ట్స్ కన్వీనర్ భానులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చ నాయకులు అనిల్, నరేష్ తదితరులు ఉన్నారు.

18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటర్ నమోదు చేసుకోవాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, జూలై 27 మనం ప్రతినిధి: జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్ కార్డు కొరకు నమోదు చేసుకోవాలని, తద్వారా వారికి ఓటు హక్కును కల్పించడం జరుగుతుందని కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గాల వారిగా పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ జాబిత సవరణపూర్తిస్థాయిలో ఉండేలా కృషి చేస్తున్నామని, పోలింగ్ కేంద్రాల మార్పులపై రాజకీయ పార్టీలు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని, ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు టీమ్‌లను పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధనపు కలెక్టర్ వెంకటరెడ్డి, తహసిల్దార్ వెంకన్న,

కాంగ్రెస్, సిపిఎం, బిఆర్ఎస్, బిఎస్‌పి పార్టీల నుండి నాయకులు చకిలం రాజేశ్వర్రావు, కొట గోపి,దేవరశెట్టి సత్యనారాయణ,స్టాలిన్ పాల్గొన్నారు.

అనంతారం వాగును పరిశీలించిన ఎమ్మార్వో

తిరుమలగిరి జూలై 27 మనం న్యూస్: మండల పరిధిలోని అనంతారం బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున గురువారం స్థానిక ఎమ్మార్వో రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటివల కురుస్తున్న భారీ వర్షాలతో బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, ఆ ప్రాంతంలో ఎవరు వెళ్లకూడదని, వాగులు వంకలు, చెరువులు అలుగు పోస్తున్నాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, అదేవిధంగా రైతులు వ్యవసాయ క్షేత్రంలోని పంపుషెడ్ల వద్ద కరెంట్ స్టార్టర్లను పెట్టి ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఎలాంటి ప్రమాదాలు ఎదురైన వెంటనే రెవెన్యూ, పోలీస్‌శాఖలకు ఫోన్ చేయాలని తెలిపారు. ఆయనవెంట ఎంపిడిఓ ఉమేష్‌చారి, కమీషనర్ దండు శ్రీను, ఎస్సై ప్రసాద్, ఎంపిఓ మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నడిగుడెం జూలై 27 మనం న్యూస్: ఇటివల కురుస్తున్న వర్షాలకు వరదనీరు ప్రవహించి వాగులు వంకలు పూర్తిగా జలమయంగా మారటంతో ఆయా ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎఫ్ఓ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రత్నవరం, నడిగుడెం, చాకిరాలతో పాటు పలు గ్రామాలలో నున్న చెరువులు, మేజర్‌కాలువలను పరిశీలించి అక్కడక్కడ కంప చెట్లను జేసిబితో తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద ఉధృతంగా ఉండటంతో పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తతో ఉండాలని, ఏదైనా ఇబ్బంది కలిగితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలనారు. ఆయనవెంట ఎస్సై ఏడుకొండలు, ఎమ్మార్వో నాగేశ్వర్రావు, ఎంపిడిఓ ఎర్రయ్య, ఎంపిఓ లింగారెడ్డి, సర్పంచ్ పద్మా, నాగలక్ష్మి, మల్లేష్‌యాదవ్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బిక్షమయ్య మృతి పార్టీకి తీరని లోటు

పెన్‌పహాడ్ జూలై 27 మనం న్యూస్: మండల పరిధిలోని దూపాడు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు దొంగరి బిక్షమయ్య ఇటివల గుండెపోటుతో మృతి చెందగా గురువారం మృతుని దశదిన కర్మకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బిక్షమయ్య కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో వృద్ధులు మహిళలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం 09 సంవత్సరాలలోనే అభివృద్ధి అంటే ఏంటో సిఎంకేసిఆర్ చూపించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి యుగేంధర్, నాయకులు మా మిడి అంజయ్య, వెన్నె సీతరాంరెడ్డి, బిట్టు నాగేశ్వర్రావు, నాగా ర్జున, వెంకటేశ్వర్లు, రాంబాబు, సోమయ్య, వీరయ్య, అరవింద్, రవి యాదవ్, ఒట్టెద్దు నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపు

తిరమలగిరి జూలై 27 మనం న్యూస్ : పట్టణంలోని 8వ వార్డులో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడకుండా వెంటనే జేసిబి సహాయంతో గురువారం స్థానిక కౌన్సిలర్ శాగంటి అనసూర్య రాములు నీటిని, పేరుకుపోయిన చెత్త చెదరాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ రాములు, వార్డు ఇంచార్జ్ మైసూర్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలి

సూర్యాపేట టౌన్ జూలై 27 మనం న్యూస్ : గత కొన్ని రోజుల నుండి తమ న్యాయ డిమాండ్లను నేరవేర్చాలని మండల కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వం నుండి ఏటువంటి ప్రకటన రాకపోవడంతో గురువారం పలు మండలాల గ్రామ పంచాయితీ కార్మికులంతా ఏకమై జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా కార్మికసంఘం నాయకులు, సిఐటియు నాయకులు మాట్లాడుతూ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తమ డిమాండ్లను నేరవేర్చాలని కోరుతున్నామని, అయిన ప్రభుత్వం తమకు న్యాయం చేయడంలేదని, తమను కాదని సంబంధిత అధికారులు గ్రామాలలో వందల రూపాయలు చెల్లించి రోజువారి కులీలతో పని చేయిస్తున్నారేకాని తమ డిమాండ్లను పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైన ప్రభుత్వం తమను గుర్తించి డిమాండ్లను నేరవేర్చాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధనపు కలెక్టర్ వెంకటరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుంగతుర్తి జూలై 27 మనం న్యూస్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మార్వో రాంప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంపటి, గొట్టిపర్తి, రావుల పెల్లి గ్రామాలలో చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు పురాతన భవనాలలో ఉండకూడదని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, చిన్నారులను సాధ్యమైనంతవరకు బయటకు రానివ్వకూడదని, గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ అబ్బాగాని పద్మా, వెంకన్న, నాగయ్య, కటికి రెడ్డి వెంకన్న, మల్లయ్య, సుధాకర్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ ఉద్యోగులు

సూర్యాపేట టౌన్ జూలై 27 మనం న్యూస్ : ఇటివల పేట జిల్లాకు అధనపు కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన చెక్క ప్రియాంకను గురువారం తన చాంబార్‌లో మున్సిపల్ కమీషనర్ రామాంజులరెడ్డితో పాటు సిబ్బంది మర్యాధపూర్వకంగా కలిసి పూలబోకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో ఈఈ జికెడి ప్రసాద్, డీఈ సత్యారావు, ఎఈలు సుమంత్, వరుణ్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డులలో వర్షపు నీరు నిలువకుండా చర్యలు

మున్సిపల్ పరిధిలోని పలు వార్డులను గురువారం మున్సిపల్ కమీషనర్ రామాంజులారెడ్డి, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో నీరు నిలువకుండా చెత్త చెదారాలను, అడ్డుగా ఉన్న చెట్లను జెసిబితో తొలగించారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఏదురైతే వెంటనే మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇవ్వాల్సిన చరవాణి సంఖ్య 08684220049కు తెలియ జేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సారగండ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాలా ఆక్రమణతో అవస్థలు పడుతున్న ప్రజలు

సూర్యాపేట టౌన్ జూలై 27 మనం న్యూస్ : పట్టణంలోని 16వ వార్డు తిరుమల నగర్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖమ్మం రోడ్డు భారత్ పెట్రోల్ బంక్, జాలు బావి మూసి కెనాల్ కింది భాగం నుండి వచ్చే వర్షపు నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి సైతం లేకుండా పోయిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి సలిగంటి వీరేంద్ర తెలిపారు. గురువారం ఆ వార్డులోని ఆక్రమణకు గురైన నాలాను ప్రజలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్నెళ్లుగా ఇక్కడి ప్రాంతం కొందరి ఆక్రమణదారులు హస్తగతం చేసుకుని నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ విషయమై పలు మార్లు మున్సిపల్ కమీషనర్‌కు, ఆర్డీఓ, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, అయిన ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయిందని, దీంతో వర్షాలు కురిసినప్పుడల్లా ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఇకనైన సంబంధిత అధికారులు నాలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ప్రజలను ఈ అవస్థలను నుండి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నేరవేర్చాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, జూలై 27, మనం న్యూస్ : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నేరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన హజరై మాట్లాడుతూ అధికారంలో ఉన్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన ప్రతి హామీని నేరవేర్చాలని లేనియడల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో అన్ని నియోజవర్గాలలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. హామీల అమలుకై ఆగస్టు 7న సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు రుణమాఫీ, గృహలక్ష్మి పథకం అమలు, కొత్త రేషన్‌కార్డులు, పొడుభూమి రైతులకు పట్టాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గసభ్యులు పాలకూరి బాబు, దేవరం మల్లిశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,

యల్లావుల రమేష్, కొప్పోజు సూర్యనారాయణ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మండల వైద్యాధికారి డా. సన

హుజూర్‌నగర్, జూలై 27, మనం న్యూస్: వర్షాకాల సీజన్‌లో ఎడతె రిపి లేకుండా కురుస్తున్న వానల వలన వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్ర మత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డా. సన అన్నారు. గురువారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ హస్టల్‌ను సందర్శించి విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల గురించి అవగాహణ కల్పిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహారం వలన కలరా డయేరియా, కామెర్ల వ్యాధులు ప్రబలుతాయని, దోమల ద్వారా డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, బొధ వ్యాధులు ప్రబలుతా యని కావున కాచి చల్లార్చిన నీటిని త్రాగడం, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా,దోమలు కుట్టకుండా, జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ నూర్జహాన్ బేగం, ఇందిరాల రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తిరుమలగిరి జూలై 27 మనం న్యూస్ : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఈగలు, దోమల వలన సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. మల్లెల వందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలుషిత నీరు ఆహార పధార్థాలు తినటం వలన డైయేరియా, నీళ్ల విరోచానాలు, టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, కావున ప్రజలు కాచి చల్లార్చి, వడబోసిన నీటిని త్రాగాలని, ఈగలువాలిన పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో చిన్న చిన్న పూల కుండీలు, వాడిపడేసి డిస్పోజల్ గ్లాసులలో కొబ్బరి బొండాల లో, కూలర్‌వంటి ప్రదేశాలలో దోమలు గుడ్లు పెట్టి తమ సంతతని పెంపొందిస్తాయని, దీంతో సీజనల్ వ్యాధులు ప్రభ లే అవకాశం ఉన్నందున వీటిని దృష్టిలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గరిడేపల్లి, జూలై 27, మనం న్యూస్ : గత 4రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ వెంకట్‌రావు సూచించారు. గురువారం మండల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్‌ఫ్రెన్స్‌లో ఆయన మాట్లాడుతూ వర్షాలకు వాగులు, చెరువులు పొర్లితే వెంటనే సహాయకచర్యలు చేపట్టాలనిత శిదిలావస్థలో ఉన్న భవనాలు, ఇండ్ల వద్ద నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కార్తీక్, ఎంపీడీవో వనజ, పోలీసు, విద్యుత్, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన అదనపు కలెక్టర్

సూర్యాపేట జూలై 27 మనం ప్రతినిధి : సూర్యాపేట జిల్లా అధనపు కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన చెక్క ప్రియాంక గురు వారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి నివాసంలో కలిసి పూలబోకేను అందజేశారు. ఈ సందర్భంగా అధనపు కలెక్టర్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలుపుతు ప్రజా సమస్యల పరిష్కారంలో ఉత్సహంగా పనిచేయాలని విధినిర్వాహణలో ప్రజల మెప్పు పొం దాలని సూచించారు.

నోట్‌బుక్స్, ప్యాడ్స్ పంపిణీ

పెన్‌పహాడ్ జూలై 27 మనం న్యూస్: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహం చీదేళ్ల సింగిల్ విండో చైర్మన్ వెన్నె సీతరాంరెడ్డి జన్మదినం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ మిఠాయిలు పంపిణి చేశారు. అనంతరం సీతరాంరెడ్డి విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు, పాడ్స్‌ను పంపిణిచేశారు. విద్యార్థులను బాగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఓ సోమ్లానాయక్, లక్ష్మణ్, నాగరాజు, వార్డెన్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

- పునరావాస కేంద్రాలలో మౌళిక వసతులు కల్పించాలి
- ఆస్తి,ప్రాణ నష్టం జరుగకుండా పటిష్ట చర్యలు
- లోతట్టు ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- అత్యవసర సమయంలో కంట్రోల్‌రూం నెం.7995070699
- డివిజనల్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జూలై 27, (మనంప్రతినిధి): జిల్లాలో భారీ వర్షాలతో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు త్వరితగతిన తరలించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ఎడతెరపి లేకుండ కురుస్తున్నా వర్షాలకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి, పార్వతి బ్యారేజీ ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వస్తుందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముంపు గురయ్యే ప్రాంతాలను గుర్తించి వెంటనే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలో ముంపుకు గురైన ప్రజలను సమీపంలో గల జి.పి.లలో, ప్రభుత్వ భవనాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడకు తరలించాలని, పునరావాస కేంద్రాలలో త్రాగు నీరు, ఇతర మౌళిక సదుపాయాలు, వైద్య సదుపాయాలతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది అందరూ స్థానికంగాఉండాలని, ముంపు ప్రాంతాలలో పర్యటించాలని ప్రజల మధ్య ఉండాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్, గ్రామ పంచాయితీ రాజ్ అధికారులు గ్రామ పరిధిలో పురాతన, శిథిల భవనాలు, గోడలు కూలే పరిస్థితులు ఉన్నట్లయితే, వాటిని గుర్తించి నివాసితులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. జిల్లా ఉన్న చెరువులు, వివిధ ప్రాజెక్టుల కాల్వలు నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, చెరువుల, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు వంకల వద్ద మత్తడి పొంగిపోర్లే ప్రాంతాలను గుర్తించి ఎప్పటికప్పుడు 24గంటలు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి, జంతు నష్టం జరుకకుండా ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అత్యవసర సమయంలో జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంనెంబర్ 7995070699 పోన్ చేయాలని కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు అరుణ్య శ్రీ, శ్యాం ప్రసాద్‌లాల్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహాశాల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి కురుస్తున్న వర్షాలు

- పొంగిపొర్లుతున్నా వాగులు వంకలు
- నీట మునిగినా పంట పోలాలు
- రాకపోకలకు అంతరాయం

పెద్దపల్లి, జూలై, 27 (మనంప్రతినిధి): జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. పెద్దపల్లి జిల్లా సమీపంలోని రంగపల్లి వద్ద రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది. పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి వాగు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే రంగపల్లి వద్ద రహదారిపై వరద నీరు రావడంతో కరీంనగర్ నుండి వస్తున్న వాహనాలను దారి మళ్లించారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. భారీ వర్షాలకు మండలంలోని పంట పోలాలు నీటమునిగాయి.

గంగమ్మ తల్లికి హారతులు

చిగురుమామిడి, జులై 27, (మనంన్యూస్): గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల లోని చెరువుల కుంటలు కొత్తనీటితో జలకలను సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీపీ కొత్తవినీత శ్రీనివాస్ రెడ్డి చిగురుమామిడి మండల కేంద్రంలోని ఊర చెరువు మత్తడి ప్రవాహం పరువాలు తొక్కుతూ ప్రవహించటంతో గురువారం ఎంపీపీ గంగమ్మ తల్లిని పూజించి పసుపు కుంకుమ పూలతో హారతులు ఇచ్చి టెంకాయ కొట్టారు. అనంతరం నిండుకుండగా జలకళతో నిండుకున్న చెరువులను పరి శీలించారు. ఆయా గ్రామాల సర్పంచులతో పాటు సంబంధిత అధికారులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.నరసయ్య తహసిల్దార్ జయంత్ బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి స్థానిక సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, రైతు సంఘం మండల కోఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, న్యాయవాది బెజ్జకి రాంబాబు, ముక్కెర సదానందం, ఆర్ఐ పూదరి రాజు, రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,

వరుణుడి ఉగ్రరూపం పొంగిపొర్లిన చెరువులు

- క్షేత్ర స్థాయిలో అధికారుల సహాయ చర్యలు

వెల్గటూర్,జూలై 27, (మనం న్యూస్) గత రెండు రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువులు వాగులు ఉప్పొం గుతున్నాయి. ఉమ్మడి మండలాలలోని రాజరాంపల్లి గోదావరిఖని మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న రాజరాంపల్లి వద్ద తాత్కాలిక వం తెన కొట్టుకొని పోగా రాకపోకలు నిలిచిపోయాయి.పాతగూడూరు కొత్తపేట ,పడకల్ జగదేవ్ పేట, గొడిసెల పేట మారేడుపల్లి, చేగ్యా మ్, పైడిపల్లి, ఎండ పల్లి గ్రామాలలో చెరువులు కుంటలు నిండడంతో వంతెనలపై నుండి నీరు ప్రవహించింది.జగదేవ్ పేట వెల్గటూర్ మార్గంలో లారీ వరదలో చిక్కుకుపోయింది. ఉండేడ గ్రామంలో చెరువు పూర్తిగా నిండడంతో సర్పంచ్ అధ్వర్యంలో మత్తడి ని జేసీబీ సహాయంతో తొలగించారు. కోటిలింగాల, చేగ్యాం పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఎండపల్లి తాహసిల్దార్ మెండి ఉదయ్ కుమార్, గిర్దావర్ వంగల క రుణాకర్ లు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డ్ లేఖలు



రామకృష్ణాపూర్, జూలై 27, (మనం న్యూస్): రామకృష్ణాపూర్ ప ట్టణంలోని క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో టియుడబ్ల్యుజే (ఐజేయు)తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్,ప్రధాన కార్యదర్శి విరహత్ ఆలీ, యూనియన్ రాష్ట్ర అగ్ర నాయకుల ఆదేశాల మేరకు క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులతో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలనిపోస్ట్ కార్డులలో క్లుప్తంగా రాసి రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ కు పోస్ట్ చేశారు.ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలువల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిళ్ళ శ్రీనివాస్,ట్రెజరర్ పరికిపండ్ల రాజు, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామిడి సాయి సృజన్,క్లబ్ ఇన్చార్జి చొప్పదండి జనార్ధన్,క్లబ్ సభ్యులు అనిల్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు తోడుగా ఉంటా

- వరద బాధితులకు తక్షణమే లక్ష సాయంఅందించాలి
- డిసిసి అధ్యక్షులు మక్కాన్ సింగ్

గోదావరిఖని, జులై 27, (మనం న్యూస్): గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాల వల్ల పలు కాలనీలు ముంపునకు గురై, ఇళ్లలోకి నీరు చేరడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్న నిరాశ్రయులకు వెన్నంటే ఉంటానని పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వారికి భరోసా కల్పించారు.గురువారం 23 వ డివిజన్ మోబినగర్,సుభాష్ నగర్ ఏరియాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇండ్లలోకి నీరు చేరి ప్రజలంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో మక్కాన్ సింగ్ ఆ ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి,వారికి మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన కనీస బాధ్యత మరిచి పట్టి పట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని ఆరోపించారు. వరదల వల్ల ముంపునకు గురైన బాదితులను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఇంటికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే సహాయ నిధి నుండి తక్షణమే బాధితులను ఆదుకోవాలన్నారు.వరదల వల్ల కూలిపోయిన, శిధిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉంటున్న వారికి తక్షణమే డబుల్ బెడ్ రూములు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు నగునూరి రాజు, ఎండి అసిఫ్ పాష,నజీమ్,రమేష్,గౌస్ బాబా మని, సురేష్, హరి, సాయి, అజయ్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కొమురంభీం ఆసిఫాబాద్, జులై 27, (మనం న్యూస్): జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యుజే -ఐజేయూ) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో టీయూడ బ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిం చాలని సీఎం కేసీఆర్ కు పోస్టు కార్డుల ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్ట్ లు పోషించిన భూమిక అత్యంత కీల కమైనదని సీఎం కేసీఆర్ జర్నలిస్టులకు ప్రశంసించీ జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు హామీ ఇచ్చారని ఇప్పటివరకు ఆ హామీలు నెరవేర్చ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టు ఆరోగ్య పథకం కింద అందించిన హెల్త్ కార్డులు అమలయ్యేలా వెంటనే చర్యలకు తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న జర్నలిస్టులను గుర్తించి జర్నలిస్టు బంధు పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దశల వారి ఆందోళనలో భాగంగా వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సీఎం కేసీఆర్‌కు పదివేల పోస్టు కార్డుల పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి ఆడప సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవునురి రమేష్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, జర్నలిస్టులు మేకల శ్రీనివాస్, సురేష్ చారి, వారణాసి శ్రీనివాస్, రాధాకృష్ణ చారి, మిలిన్ కుమార్ కుమార్ పాల్గొన్నారు.

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దు
- పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి

పెద్దపల్లి, జూలై 27, (మనంప్రతినిధి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పెద్దపల్లి పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లిమున్సిపల్ చైర్మన్ దాసరి మమతారెడ్డి అన్నారు. గురువారం రంగంపల్లి వద్ద రాజీవ్ రహదారి, పలు వార్డులలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వర్షాల కారణంగా నీరు నిల్వ ఉన్నచోట తీసుకోవాల్సిన చర్యలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. బస్టాండ్ వద్ద నీరు నిలవడంతో జేసీబీ సమాయంతో చెట్టును తొలగించి బస్సుల రాకపోకలను పునరుద్ధరించడం జరిగిందనితెలిపారు.ఎటువంటి పరిస్థితులైన ఎదుర్కోవడానికి మున్సిపల్ కౌన్సిల్, సిబ్బంది సిద్ధంగా ఉన్నామని పట్టణ ప్రజలు అత్యవసర పరిస్థితులలో మాహెల్ప్ లైన్‌నెంబర్ 9988556162 సంప్రదించాలని కోరారు. వార్డు కౌన్సిలర్లు కొమిరిశెట్టి కనకలక్ష్మీ, శ్రీకాంత్, బొంకూరి భాగ్యలక్ష్మీ సన్ని, గాదె మాధవి, పూదరి చంద్రశేఖర్, పాగాల సోని శ్రీకాంత్, సాహిదా సాబీర్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు వెన్నంపల్లి రవీందర్, కాశిపాక వాసు, బొంకూరి అఖిల్, బొంకూరి నిఖిల్, పల్లె మధు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్, సానిటరీ ఇన్స్పెక్టర్లు రామ్మోహన్‌రెడ్డి, పులిపాక రాజు, జయరాజ్, చిన్న శ్రవణ్, మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్బితం జలపాతం సందర్శనకు ఎవరు రావద్దు

- ప్రజల రక్షణ, ప్రాణాల దృష్ట్యా జలపాతం సందర్శన నిలిపివేత
- తాత్కాలిక ఆనందం కోసం ప్రాణాలను కోల్పోవద్దు
- పోలీస్ చెక్ పోస్ట్, పికెట్ ఏర్పాటు
- బసంత్‌నగర్ ఎస్సై వెంకటేష్

పెద్దపల్లి, జూలై 27 (మనం ప్రతినిధి) : పెద్దపల్లి మండలంలోని సబ్బితం గౌరీ గుండాల జలపాతం సందర్శనకు ఎవరు రావోద్దని బసంత్ నగర్ ఎస్సై ఐ.వెంకటేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలికే ఆనందాల కోసం యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశామని, నిషేదాజ్ఞలు ఉన్నాయని, పోలీస్ వారి మాటలను పట్టించుకోకుండా యువత కొందరు మధ్యామాల్లో పోస్టుల కోసం సెల్ఫీ మోజులో పడి, స్నేహితులతో సరదా కోసం యువత ప్రాణాలు పోగుట్టుకుంటున్నారని అన్నారు. సబ్బితం జలపాతం వద్ద యువకులు చనిపోవడం జరుగు తుందని, ప్రజల రక్షణ, ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని సందర్శనను నిలి పివేస్తున్నామని తెలిపారు. భారీవర్షాల కారణంగా జలపాతం వద్ద ఉధృ తంగా నీరు ప్రవహిస్తుందని ఆయన పేర్కొన్నారు. జలపాతం సందర్శనకు ఎవరు రావద్దని బసంత్ నగర్ ఎస్సై వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.

ఇసుక క్వారీలో చిక్కుకున్న వారికి రక్షణ చర్యలు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథని, జులై 27, (మనంన్యూస్): పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలం గోపాల్‌పూర్ గ్రామంలోని ఇసుక క్వారీలో పనిచేస్తున్న 15మంది సిబ్బంది వరదలో చిక్కుకున్నారు. వరద ఉధృతి కావడంతో బయటికి రాలేక చిక్కుకోవడంతో అందులో ఒకరు మానేరు నదిలో గల్లంతై కొట్టుకొని పోయి చిన్న బోలాల వద్ద మానేరు ఒడ్డుకు సురక్షింతంగా బయటపడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈవిష యం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హుటా హుటిన మానేరు వద్దకు చేరుకొని స్పీడ్‌బోట్ల సహాయంతో మిగతా కూలీలను రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈసహాయక చర్యల్లో పెద్దపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, పుట్ట శైలజ, డిసిపి వైభవ్ గైక్వాడ్‌లున్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- ఎమ్మెల్యే డా.రసమయి పిలుపు

తిమ్మాపూర్, జూలై 27 (మనం న్యూస్) : గత ఐదు రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా ఎడ తెరిపి లేకుండా కు రుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని మానకొండూర్ శాస నసభ్యులు డా. రసమ యి బాలకిషన్ నియోజకవర్గ ప్రజలకు పిలుపు నిచ్చారు. తడిసిన కరెంటు స్తంభాలతో పాటు తడిసిన విద్యుత్ మీ టర్ల ను ముట్టకోవద్దని, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ప్రజ లకు సహాయ, సహకారాలు అందించడంతో పాటు అప్రమ త్తంగా ఉండాలి అని గురువారం క్యాంపు కార్యాలయంలో ఆ యన ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ సూచించారు.

అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేసిన ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

వీణవంక, జూలై 27, (మనం న్యూస్): మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవ ర్గంలోని వివిధ శాఖల అధికా రులు, ప్రజాప్రతినిధులతో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి టెలికాన్ఫరెన్స్ ద్వారా గురువారం సంబాషించారు. ప్రజలు ఎవరు చెరువులు, వాగుల వద్దకు వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలని, శిథిలావస్థల ఉన్న గృహాలలో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు, ప్రజాప్ర తినిధులు ప్రజల వెంట ఉండి వారికి సహాయ సహకారాలు అందిస్తూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని సూచించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- రైతులు పొలం పనులకు వెళ్లొద్దు
- పిల్లల్ని బయటిక పంపొద్దు
- అత్యవసమైతేనే బయటికి రావాలి
- మహబూబాబాద్ కలెక్టర్ కే.శశాంక

మరిపెడ, జూలై 27(మనం న్యూస్): భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆందోళన చెందరాదని, ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందజేస్తారని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. గురువారం ఆయన మరిపెడ మండలంలోని పురుషోత్తమయా గూడెం వద్ద ఆకేరు నదీ ఉధృతని ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి పరిశీలించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండి నివేదికలు అందించేందుకు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, ఇరిగేషన్, ఫైర్ అధికారులకు విధులు కేటాయించి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. వ్యవసాయ పనులు తాత్కాలికంగా నిలుపుదల చేయాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. పశువులు, గొర్రెలు, మేకలను మేతకై విడిచి పెట్టరాదని కాపరులకు తెలియజెప్పారు. మత్స్యకారులు చేపలు పట్టేందుకు వెళ్లరాదన్నారు. విద్యుత్ స్తంభాలను తాకరాదని, తడిసిన మట్టిగోడలకు దూరంగా ఉండాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను, శిథిలావస్థకు చేరిన ఇండ్లలోని ప్రజలను 300 మందిని, సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. వైద్యాధికారులు అందుబాటులో ఉంటారని, ఆరు మాసాలు దాటిన గర్భిణీ స్త్రీలను సకాలంలో వైద్యం అందించేందుకు పి.హెచ్.సి.లకు తరలించాలని అదేశించామన్నారు. అత్యవసరమైతేనే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రాకూడదని, వరద ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బారి కేడ్స్ దాటి లోనికి వెళ్లరాదన్నారు. దారిమళ్లిస్తున్న దృష్ట్యా ప్రజలు సహకరించాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఎంపీడీవో ధన్సింగ్, ఎస్ఐ దూలం పవన్ కుమార్, ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు, తదితరులున్నారు.

ఆదుకున్న రెడ్ క్రాస్ సొసైటీ

కేసముద్రం, జూలై 27(మనం న్యూస్)ః గురువారం రోజున తాళ్లపూసపల్లి గ్రామంలో భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిన మాద శ్రీను, కందుకూరు ఉప్పలమ్మ, నకరికంటి లచ్చమ్మలకు రెడ్ క్రాస్ సంస్థ మహబూబాబాద్ ఆధ్వర్యంలో వాటర్ ప్రూఫ్ పైకప్పు (ప్లాస్టిక్ కవర్)ను, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను అందజేసినారు. వారి వెంట గ్రామ సర్పంచి రావుల విజిత రవిచంద్ర రెడ్డి ఉన్నారు. ఆపదలో ఆదుకున్న సంస్థలకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర కమిటీ మెంబర్ రావుల రవిచందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ నెహ్రూ నాయక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు గొర్రె వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే మోడీ సంకల్పం

తొర్రూర్, జూలై 27 (మనం న్యూస్): దేశవ్యాప్తంగా 2.5 లక్షల కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రారంభం, 8.5కోట్ల మంది రైతుల ఖాతాలో కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 17వేల కోట్ల రూపాయలు జమ చేస్తున్న సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ ఉపన్యాసం స్థానిక కిసాన్ సమృద్ధి కేంద్రంలో రైతులతో కలిసి లైవ్ ప్రసారం వీక్షించారు. ఈ సందర్భంగా బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ రైతుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. రైతుల కోసం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఈరోజు 2.5 లక్షల కేంద్రాలను ప్రారంభం చేసి రైతులకు ఎరువులు,విత్తనాలు కొరత లేకుండా చేస్తున్నారు అని తెలిపారు.రైతులకు సల్ఫర్ పూతతో కూడిన నాణ్యమైన యూరియా ను అందిస్తున్నారని తెలిపారు.రైతులపై ఆర్థిక భారం పడకుండా పెద్ద ఎత్తున సబ్సిడీని ఇస్తూ రైతులను ఆదుకుంటున్నారని తెలిపారు.గతంలో కాంగ్రెస్ హయాంలో రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి క్యూలో నిలబడి ఎదురు చూసేవారు అని,కానీ నేడు నరేంద్ర మోడీ రైతులకు ఎరువుల కొరత లేకుండా అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకొని అందరికీ ఒకే విధంగా భారత్ బ్రాండ్ పేరుతో సల్ఫర్ పూతతో కూడిన నాణ్యమైన యూరియా ను అందిస్తున్నారని,నానో యూరియా ను అందిస్తున్నారని తెలిపారు.రైతుల ఆదాయం రెట్టింపు చేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపి రైతును రాజు చేయడమే మోడీ సంకల్పం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు మంగళపల్లి యాకయ్య, పైండ్ల రాజేష్,నూకల నవీన్,పప్పుశెట్టి సంతోష్, కుమ్మరి కుంట్ల శివ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి నీట మునిగిన సబ్ స్టేషన్, కుప్పకూలిన ఇల్లు గోడ

ఇల్లందకుంట, జులై 27 (మనం న్యూస్) : గత రెండు రోజులుగా కురుస్తున్నభారీ వర్షం కారణంగా పొంగిపొర్లుతున్న వాగు వంకలతో మండలంలోని సిరి సేడు గ్రామంలోని భోగం సాయిలకు చెందిన ఇల్లు కుప్పకూలింది. ఈ సంఘటనలో ఎవరికి ప్రాణ హాని జరగలేదు. గొట్టి శేఖర్‌కు చెందిన ఇల్లు గోడ కూలిపోయింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని భాధితులు కోరుతున్నారు. సిరిసేడు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నీటిలో మునిగింది. దీనితో గ్రామంలోని 2 రోజుల నుండి కరెంటు అంతరాయం ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం మధ్యాహ్నం వరకు కరెంటు సరఫరా ఆగిపోయింది. అయినప్పటికీ లైన్ మెన్ రౌతు మోహన్, ఇతర సిబ్బంది సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టారు.కరెంటు సరఫరా పునరుద్ధరీకరణ చేసిన లైన్ మెన్‌కి, కరెంటు సిబ్బందికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలు ఎవ్వరూ బయటికి రావద్దు...

- జిల్లా కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, జూలై 28(మనం ప్రతినిధి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తప్పా ప్రజలు ఎవరు బయటికి రాకూడదని జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. గురువారం నాడు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించినందున విద్యార్థులను బయటికి పంపవద్దని.రైతులువ్యవసాయ పనులు నిలుపుదల చేయించాలని సూచించారు.వాగులు వంకలు పొంగి పొర్లుతున్నందున సమీప ప్రాంతా గ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముంపు ప్రాంతాలలో ఉన్నవారు ఇల్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.వర్షానికి తడిసిన గోడలను విద్యుత్తు స్తంభాలను కానీ వైర్లను కానీ తాకవద్దని కలెక్టర్ సూచించారు.వర్షాలకు ఇబ్బందులు పడుతున్న వారు సహాయం కొరకు కంట్రోల్ రూమ్ నెంబర్79950 74803కు కాల్ చేయాలన్నారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అధికారుల అప్రమత్తంగా ఉంచా మన్నారు.6 నెలలు దాటిన గర్భిణీ స్త్రీలు వైద్యాధికారుల సలహా మేరకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో ఉండాలని భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నందున ఆయా రహదారులను మూసివేయడం జరిగిందని అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. రోడ్లపై నీరు ప్రవహిస్తున్నప్పుడు ద్విచక్ర వాహనాలు ఆటోలు వెళ్లేందుకు అనుమతి ంచడం లేదనికుండపోతగా వర్షం కురుస్తున్నదని ప్రజలు గ్రహించాలని ఎన్ని అత్యవసర పనులు ఉన్న వాయిదా వేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులు బాగోలేనందున ప్రయాణికులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాగులు వంకలు వద్ద ప్రజలను దాటనీయ రాదని ప్రత్యామ్నాయ రోడ్ల ద్వారా వెళ్లేలా చూడాలని ఆదేశించారు. అత్యవసరమైన పనులు ఉంటేనే బయటికి రావాలని వీలైన ంత వరకూ ప్రయాణాలను వాయిదా వేసుకోవటం మంచిదని కలెక్టర్ అన్నారు. పిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపరాదని ముప్పుప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు సహకరించాలని కోరారు.శిథిల భవనాలలో ఉన్న ప్రజలను తక్షణం ఖాళీ చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, మందులు కూడా సిద్ధంగా ఉంచుకో వాలన్నారు.చెరువులు మత్తడి పోస్తున్నందున నీటిపారుదల శాఖ అధికా రులు సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. రెండు రోజుల ఎఠాటు పనులను నిలిపి వేయించాలన్నారు పశువుల మేకలు గొర్రెల కాప ర్లు బయటకు వెళ్ళరాదని పశువులను ఇంటి వద్దే కట్టేసి ఉంచాల న్నా రు.యువత చెరువుల వద్ద చెక్ డ్యాంల వద్ద సెల్ఫీలు దిగరాదని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య

తొర్రూర్, జూలై 27 (మనం న్యూస్): వర్షాలు పడుతున్నందున్న పట్టణ ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలి..అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దు. మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య. వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి కమిషనర్ పి సరస్వతి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాల వలన రోడ్లపై చెట్లు జెసిబి సహాయంతో క్లియర్ చేయించమన్నారు. ట్రాఫిక్కు ఎటువంటి అంతరాయం రాకుండా క్లియర్ 13వ వార్డులో కూలిపోయే పరిస్థితిలో ఉన్న నివాసం ఉంటున్న వాళ్లను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 12వ వార్డులో ఉంటున్న 21 కుటుంబాలను ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ కు వారికి వసతి సదుపాయం భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇండ్లను జెసిబి సహాయంతో కూల్చివేశామన్నారు. వర్షాలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ చెబుతుంది...రైతులు, ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు.రైతు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్, విద్యుత్ వైర్లు ముట్టుకోవద్దు.... వర్షం పడుతున్నప్పుడు కరెంట్ పోల్స్ కానీ మిగతా ఎలక్ట్రిక్ పోల్స్ కానీ ముట్టుకోకండి అని రైతులకు తెలిపారు... రైతులు వర్షం వస్తున్నప్పుడు చెట్ల కింద ఉండొద్దు అని సూచించారు...మరి ముఖ్యంగా,కరెంటుకు సంబంధించిన ఎలాంటి వస్తువులను తడిచేతులతో ముట్టుకోవద్దని చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు. కౌన్సిలర్లు భూసాని రాము. తుణం రోజా సంగీత రవి. యమునా జంపా.సునీత జైసింగ్. గజానంద్. అలివేలు. దొంగరి రేవతి శంకర్. నాగజ్యోతి నాగరాజు. గూగులోత్ శంకర్. కొలుపుల శంకర్. బిజ్జాల అనిల్ మాధవి. కో ఆప్షన్స్. గుండాల యాకాంత నరసయ్య. కుర్ర కవితా శ్రీనివాస్. మహమ్మద్ జలీల్. జలకం శ్రీనివాస్. సానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్. వార్డ్ ఆఫీసర్లు బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు

- కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో సామాజిక సంఘాలు

మహబూబాబాద్ జూలై 27 (మనం న్యూస్) ః గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కొనసాగిస్తామని కెవిపిఎస్ నాయకులు హెచ్చరించారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని పెరమళ్ళ జగన్నాథం భవన్లో కెవిపిఎస్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు కోసం వచ్చిన జీవో నెంబర్ 60ని పకడ్బందీగా అమలు చేసి కార్మికులపై పని భారం పెంచే జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలనికనీస వేతనం ఇవ్వాలని గ్రామపంచాయతీ జేఏసీని చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కెవిపిఎస్ ఇరవై రోజులుగా కార్మికులను పర్మినెంట్ చేయాలని వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని కోరారు. ఎండా వాన చలిలో ఆరుగాలం కష్టపడి పల్లెల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల అత్యధికులు దళితులు కావడం వల్లే ప్రభుత్వం వివక్ష పాటిస్తుందన్నారు జీవో నెంబర్ 51 ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులకు పని భారాన్ని పెంచడం సరైంది కాదన్నారు. వేతనాలు పెంచమంటే పని భారం పెంచుతారా అని ప్రశ్నించారు ప్రమాదవశాత్తు కార్మికులు మరణించిన కనీస ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ఇవ్వలేకపోవడం సిగ్గుచేటు అన్నారు కనీస ప్రాథమిక హక్కుగా పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. కరోనా వంటి కష్టకాలాల్లో ప్రజల ప్రజలని తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి ఆదుకున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైనది కాదన్నారు కేంద్ర బిజెపి సర్కార్ నేడు టెంట్ల వద్ద మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను కాల రాసి కార్పొరేట్లకు ఉపయోగపడే నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్లకు మేలు చేస్తుందన్నారు 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బిజెపి సర్కార్ దేనని విమర్శించారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జిపి జేఏసీ ని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేలూత్ సాయికుమార్ పిఎన్ ఎం నాయకులు కొమ్ము శ్రీనివాస్ కెవిపిఎస్ నాయకులు చీపిరి యాకయ్య మందుల మహేందర్ మచ్చ వెంకటేశ్వర్లు సూర్యప్రకాష్ కాగితపు రాజు మిగతా కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తడి పోస్తున్న గార్ల పెద్దచెరువు



గార్ల, జూలై 28(మనం న్యూస్): గత వారం పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని గార్ల పెద్దచెరువుకు వరదపోట్టెట్టడంతో గురువారంనాడు గార్ల పెద్దచెరువు నిండు కుండాలా మారి మత్తెడి పోస్తున్నాది.గార్ల పెద్ద చెరువు మత్తెడి పోస్తుండటంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గార్ల పెద్ద చెరువు నిండుకుండలా మారడంతో చెరువు అందాలను చూడటానికి ప్రజలు తండోపతండాలుగా తరలివెళ్ళడంతో ఒక్కసారిగా అక్కడ సందడి వాతావరణం ఏర్పడింది.

జల దిగ్బంధంలో గార్ల పట్టణం

- తీవ్ర అవస్థలకు గురవుతున్న ప్రజలు
- గంగమ్మ వాగులో కొట్టుకపోయిన ఎలక్ట్రానిక్ వాహనం

గార్ల, జూలై 28(మనం న్యూస్): గార్ల పట్టణం చుట్టుపక్కల గల పాకాల ఏరు, బంధం వాగు, గంగమ్మ వాగులు ఉప్పొంగడంతో గార్ల పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకపోయింది. వారం పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గురువారం నాడు గార్ల పట్టణానికి చుట్టుప్రక్కల గల గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం రాత్రి గంగమ్మ వాగును ఓ వ్యక్తి ఎలక్ట్రానిక్ వహనంతో దాటడానికి ప్రయత్నించగా అదుపుతప్పి వాహనం కొట్టుకపోగా ఆ వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డట్టు సమాచారం. గార్ల సత్యనారాయణపురం మార్గంలో ఉన్న పాకాల ఏరు ఉప్పొంగి రోడ్డుపై నుండి నీరు ప్రవహిస్తుండటంతో ఆ మార్గాన్ని గార్ల డోర్నకల్ మార్గ మధ్యలో బంధం వాగు సైతం రోడ్డుపై నుండి ఉధృతంగా ప్రవహిస్తున్నందున దాన్ని గార్ల గొల్లగూడెం మార్గంలో గంగమ్మ గుడి వద్ద గల వాగు కూడ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గార్ల ఎస్ఐ బానోత్ వెంకన్న ఆయా మార్గాలను ట్రాక్టర్లు అడ్డుపెట్టి మూసువేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. గార్ల పట్టణం జలదిగ్బంధంలో ఉండ టంతో బుధవారం అర్ధరాత్రి నుండి గార్ల మండలం అంధకారంలో ఉండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పొంగిన ఆకేరు..

- జలదిగ్బందంలో గ్రామాలు-
- బీచ్ రాజ్ పల్లి వద్ద రోడ్డుపైకి నీరు
- ఐదుగ్రామాలకు రాకపోకలు బంద్
- సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావు

మరిపెడ, జూలై 27(మనం న్యూస్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆకేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బీచ్ రాజ్ పల్లి, ఉల్లేపల్లి, భూక్యతండా, తేజావత్ తండా, గుట్టకింది తండాలకు వెళ్లే రహదారిపై పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. రహదారిపై సుమారు కిలో మీటరు మేర నీరు నిలవటంతో ఈ ఐదు గ్రామాలు పూర్తిగా రోడ్డు మార్గం లేకుండా పోయాయి. ఉల్లేపల్లి గ్రామం వద్ద ఆకేరు వాగు సుమారు 500మీటర్లు చొచ్చుకొని గ్రామంలోకి వచ్చింది. దీంతో 5విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అదే విధంగా ఏరు శివారులోని వైకుంఠ ధామం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. 24గంటలుగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావు పరిస్థతిని పరిశీలించారు. రహదారిపై నీరు ఏమేర నిలిచి ఉందో చూసి అధికారులకు తెలియజేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవ్వరూ కూడా చేపల వేటకు వెళ్లరాదన్నారు. ఆకేరు పరివాహక ప్రాంతంలోని రైతులు పొలం పనులకు వెళ్లరాదని సూచించారు. ఆయన వెంట బీచ్ రాజ్ పల్లి సర్పంచ్ నాతి కృష్ణ ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ముంపు ప్రాంత వాసులను శిబిరాలకు తరలించాలి
- డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ, జూలై 27(మనం న్యూస్): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయని, నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సూచించారు. గురువారం ఆయన మరిపెడ మండలంలోని పురుషోత్తమయగూడెం వంతెన వద్ద ఆకేరు వాగు ఉధృతిని పరిశీలించారు. అనంతరం నీటి ప్రవాహం పక్కనే ఉన్న సీతారాం తండాలోకి చేరటంతో అక్కడికి చేరుకుని తండా వాసులను పరామర్శించారు. తండా వాసులు ధైర్యంగా, జాగ్రత్తగా ఉండాలనీ సూచించారు. నీటి ప్రవాహం తగ్గిందని ఎవరు కూడా ఏరువైపునకు వెళ్లరాదన్నారు. అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా రాత్రి కురిసిన వర్షానికి నీరు తండాలోకి చేరటంతో ఉదయాన్నే అధికారులు తండా వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు వారిని పరామర్శించి వారికి కావల్సిన సదుపాయాలు కల్పించారు. సాయంత్రానికి నీరు తగ్గుముఖం పట్టడంతో తండా వాసులు ఇళ్లకు చేరుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ గుగులోతు అరుణా రాంబాబు, జెడ్పీటీసీ శారదా రవీందర్, మాజీ ఎంపీపీ వెంకన్న, ఎంపీడీఓ ధన్సింగ్, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, సర్పంచులు లక్ష్మీ లక్పతి, బిక్కు నాయక్, ఆనంద్ మాజీ సర్పంచ్ బాబు నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

తెగిన రహదారులు.. పలు గ్రామాలకు రాకపోకలు బంద్

- విలయతాండవం చేసిన కుంభవృష్టి
- 38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు..
- బంగారు గూడెం వద్ద కొట్టుకపోయిన ఆటో- ఒకరు మృతి..
- మునిగిన తాటి గూడెం, నర్సంపేట కాలనీ
- సమన్వయంతో పనిచేసిన అధికారులు

కరకగూడెం, జూలై 27 (మనం న్యూస్): కరకగూడెం మండలంలో కుంభవృష్టి విలయతాండవం చేసింది. మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాలకు పలు గ్రామాలు నీట మునిగాయి. ఇన్ని సంవత్సరాలలో చూడని వరదలు మండలాన్ని అతలకుతలం చేశాయి. బంగారు గూడెం వద్ద ఆటో వరదల్లో కొట్టుకుపోగా డ్రైవరు పాపారావు గల్లంతయ్యాడు. గ్రామస్తులు గాలించగా శవమై ఉదయం ఐదు గంటలకు దొరికారు. రఘునాధపాలెం గ్రామపంచాయతీలో ఉన్న నర్సంపేట కాలనీ కరకగూడెం గ్రామపంచాయతీలో ఉన్న మోతే తాటి గూడెం గ్రామపంచాయతీ ఇళ్లల్లోకి నీరు చేరాయి. రోడ్లపై సుమారు ఐదు అడుగుల నీరు ప్రవహించడంతో

గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. మోతే ఆనుకొని పెద్దవాగు చెన్నర్ల వాగు పొంగడంతో నర్సంపేట ఎస్సీ కాలనీ ప్రజలు భయాందోళనకు గురయ్యారు ఒక్కసారిగా వరద ఓటు ఎత్తడంతో ఇంట్లో నుండి ప్రాణభయంతో కొంతమంది మోతే చేరగా మరి కొంత మంది వర్షంలో డాబాలపైకి చేరి ఉన్నారు నర్సంపేట కాలనీలో ఉన్న కోళ్ల ఫారం 5000 పిల్లలు కోళ్ల ఫామ్ పూర్తిగా నెలమట్టమై వరదల్లో కొట్టక పోయింది.

అక్కడ ఉన్నవారు చెట్లు ఎక్కి తమ ప్రాణాలను రక్షించుకున్నారు. కరకగూడెం, చిర్ర మల్ల వద్ద ఉన్న పెద్ద వాగు బ్రిడ్జి ప్రధాన రోడ్డు కొట్టుకపోయి, ఎనిమిది గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షాలకు భారీ వరదలు పోటు ఎత్తడంతో వేల ఎకరాల పంట నష్టం ఆస్తులు నష్టం జరిగిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సమత్ బట్టుపల్లి పరిధిలోని బూడిద వాగు పొంగడంతో సారపాక గ్రామంలోకి వరద నీరు చేరాయి, కొత్తగూడెం గ్రామపంచా యతీలో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. భోజలు పోసిన మిర్చి నారు నీట మునిగి పోయింది పలుచోట్ల వాగులు వంకలు పొంగడంతో జనజీవనం అస్తవ్యస్తమైనది. త్రాగునీరు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. చిర్రామల్ల గ్రామపంచాయతీ పరిధిలోని కొంగల చెరువు ముత్యాలమ్మ

కుంట, బుర్రికుంట అలుగు పడడంతో భారీ వరదలు సంభవించి ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచాయి. రాయన్నపేట మొత్తం గోదారి తలపించేలా వరద ప్రవహిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

సమన్వయంతో పనిచేసిన అధికారులు...

మండల వ్యాప్తంగా 38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో భారీ వరదలు సృష్టించడంతో మండల తాసిల్దార్ ఉషా శారద, సిబ్బంది, కరకగూడెం ఎస్ఐ రాజారామ్ సిబ్బందితో, ఎంపీడీవో ఎంపీవో కార్యదర్శిలు తమ సిబ్బందితో, రాత్రి సమయాల్లో ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన నిత్యవసర వస్తువులు అందించారు. ఉదయాన్నే పంచాయతీ ట్రాక్టర్లలో వారిని కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించి వారికి ఆహార సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అవసరం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని వారు కోరారు. రాత్రి సమయాల్లో ప్రజలకు రక్షణగా నిలిచిన అధికారులను పలువురు ప్రశంసించారు.

వరద వీక్షకులను కట్టడి చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల
- నిరంతర పర్యవేక్షణలో అధికార యంత్రాంగం
- ఏ ఆపదనైనా ఎదుర్కుంటాం

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27 (మనం ప్రతినిధి): ముసురు కమ్ముకున్న సమయాల్లో పృకృతి ఆరాధకులు, వరద ప్రాంతాలను సందర్శించాలనే అభిలాష ఉండడం సబబే ఐనప్పటికీ, ప్రస్తుతం జిల్లాలో వరద విలయతాండవం చేస్తున్న సందర్భంలో, కాజ్ వేలు, జలాశయాల వీక్షణకు ప్రజలు రాకుండా నియంత్రణ చేసేందుకు పటిష్ట భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ డా ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. జిల్లాలో నెలకొన్న గోదావరి వరదల నేపథ్యంలో, నిరంతర పర్యవేక్షణలో ఉన్న కలెక్టర్ ప్రియాంక గురువారం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులపై, అధికార యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని, ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. కాజ్ వేలు, జలాశయాల వద్ద పటిష్ట భద్రత, ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు, రోడ్లపై నీరు చేరిన ప్రాంతాల్లో రవాణా నియంత్రణకు బారీకేడింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, సెక్టోరియల్, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీరాజ్ అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న గృహాల నుండి ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు కూలే ప్రమాదం ఉన్నందున తొలగింపుకు నోటీస్ లు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గోదావరికి ఎగువ నుండి వరద వచ్చే అవకాశం ఉన్నందున గ్రామ స్థాయి నుండి ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. చెరువులు నిండుకున్నాయని పరిరక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వరద వచ్చిన తదుపరి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం ఇబ్బంది అవుతుందని, అంత వరకు వేచి ఉండకుండా ముందస్తుగానే ముంపు గ్రామాల ప్రజలను పునరావాస

కేంద్రాలకు తరలించాలని చెప్పారు. అంతకు ముందు పాల్వంచ మాండలం నారాగం వద్ద కిన్నెరసాని వంతెన. పరిశీలించారు. అక్కడి నుండి భద్రాచలం వస్తూ మార్గ మద్యలోనే టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఐటిడిఏ పిఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, మధు సూదన్ రాజు, డిపిఓ రమాకాంత్, జడ్పి సీఈఓ విద్యాలత అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓ లు తదితరులు పాల్గొన్నారు.

రానున్న సమయం కీలకం ...

రానున్న రెండు రోజులు జిల్లాకు భారీ నుండి అతి భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ఈ రెండు రోజులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అత్యవసర సేవలకు జిల్లా కలెక్టర్ కార్యాలయపు కంట్రోల్ రూముకు కానీ 08744-241950, 9392919743 వాట్సప్ నంబర్ కు మెసేజ్ లేదా వీడియో పంపాలని చెప్పారు. అలాగే కొత్తగూడెం ఆర్డిఓ కార్యాలయంలో 9392919750, భద్రాచలం ఆర్డిఓ కార్యాలయంలో 08743-232444, వాట్స్ ప్ నంబర్ 7981219425 లకు మెసేజి లేదా వీడియో పంపాలని చెప్పారు. 24 గంటలు పని చేయు విధంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములకు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని ప్రజలు అత్యవస సేవలకు కాల్ చేయాలని సూచించారు.

ప్రమాదం గుప్పిట్లో ఆళ్లపల్లి మండలం

- జల ప్రళయం విలయ తాండవం
- వరద ఉధృతికి ఒరిగిపోయిన బ్రిడ్జి పిల్లర్లు
- తెగిపోయిన రోడ్డు మార్గాలు- పలు గ్రామాలు జలదిగ్బంధం
- అపార నష్టాన్ని మిగిల్చిన వరదలు

ఆళ్లపల్లి, జూలై 27 (మనం న్యూస్): మండల వ్యాప్తంగా గత ఐదు రోజులుగా మేఘాలకు చిల్లు పడిందా అనే విధంగా కుండ పోత వర్షాలు కురుస్తూ మండలంలో జల ప్రళయం విలేయతాండవం చేస్తుంది. గత వందల సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా కుండపోతగా కురిసే వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు, నిండుకుండల్లా మారి రోడ్ల పైనుండి జననివాసాల్లోకి భారీగా వరద నీరు చేరి జనజీవనం అతలాకుతమైపోతున్నారు. కిన్నెరసాని, జల్లేరు, కోడెల, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జనాలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కిన్నెరసాని వరద ప్రవాహం రాయపాడు, ముత్తాపురం గ్రామాలనీ చుట్టుముట్టడంతో పూర్తిగా ఇండ్లలోకి వరద నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామస్తులు డాబాలపై తలదాచుకున్నారు. కిన్నెరసాని వరద ఉధృత వల్ల రాయిగుడానికి చెందిన పలువురి 10 ఆవులు, దూడలు, ఎద్దులు, వరద ఉధృతికి కొట్టుకొని వెళ్లి చనిపోవడంతో

సంబంధిత రైతులు ఈ అకాల వరదల వల్ల తమకు జీవనాధారమైన గోవులని కోల్పోవడం జరిగిందని వారు కన్నీరు మునిరవుతున్నారు. లక్ష్మీపురం-ఆళ్లపల్లి ప్రధాన రహదారి మధ్యలో వరద తాకిడికి బ్రిడ్జి కోతకు గురి కావడంతో స్థానిక ఎంపీపీ సంఘటన స్థలాన్ని పరిశీలించి త్వరగా మరమ్మత్తులు చేపడతామని తెలిపారు. రాయపాడు ముత్తాపూరం సమీపంలో వరద ఉధృతతో కొత్తగూడెం నుండి మార్కోడు ఆర్ అండ్ బి ప్రధాన రహదారి మధ్యలో భారీ నుంచి అతి భారీ గుంతలు ఏర్పడ్డాయి. మండల కేంద్రం నుండి మార్కోడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో చంద్రపురం గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన పిల్లర్లు వరద తాకిడికి వంగిపోవడం జరిగింది. మండల వ్యాప్తంగా రాయపాడు ముత్తాపురం రాయి గూడెం బోడయ్యకుండా చంద్రపురం సీతానగరం అడివిరామవరం గ్రామాలు పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకొని రాకపోకలు పూర్తిగా స్తంభించడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు, బ్రిడ్జిలు, చెరువుల అలుగులు వరదలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక ఎస్సై రతీష్, పోలీస్ సిబ్బందితో, ఎంపీడీవో ఎం రామారావు ఎంపీ ఓ కార్యదర్శులు వారి సిబ్బంది తో, తాసిల్దార్ సుల్తాన్, వారి సిబ్బందితో, స్థానిక ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, వర్షంలోనూ రాత్రి పగలు తేడా లేకుండా ముప్పు ప్రాంతాలను పర్యవేక్షిస్తూ ఎవరిని వరద ప్రవాహం ఉన్న చోటికి వెళ్లకుండా తగు జాగ్రత్తలు చేపట్టారు.

నేమలిపేటలో వరద బాధితులకు అన్నదానం

దమ్మపేట, జూలై 27, (మనం న్యూస్): మండలంలోని నెమలిపేట గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వరద బాధిత ప్రజలకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ ఎంపీడీఓ నాగేశ్వరరావు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప గ్రామ ప్రజలు ఎవరు బయటకు రావద్దని అవసరమైతే జాగ్రత్తగా బయటికి రావాలని అలాగే కరెంటు పోల్స్ దగ్గరికి అలా వద్దని వరద ముంపు గురైన ఇండ్లలో జాగ్రత్తగా ఉండాలని ఆయన తగు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వరరావు శ్రీపాద రామానుజ చారి నెమలి పేట గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తా!

- న్యూఢిల్లీలో నామతో ఖమ్మం న్యాయవాదుల భేటీ
- న్యాయవాదుల రక్షణ చట్టం కోసం నామకు వినతి

ఖమ్మం, జూలై 27, (మనం బ్యూరో): న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు నామ నాగేశ్వర రావు తెలిపారు. న్యాయవాదులకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టు బిల్లును చట్ట రూపంలో తీసుకోవచ్చేందుకు పార్లమెంట్‌లో కేంద్రం దృష్టికి తీసుకురావాలని కోరుతూ తెలంగాణా లోని ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యులు తాళ్లూరి దిలీప్ ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం గురువారం న్యూఢిల్లీలో నామ నాగేశ్వరరావును కలసి లేఖ అందజేశారు. పార్లమెంట్ సమావేశాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం, నోటరీల అంశా లను లేవనెత్తుతానని అన్నారు. ఈ సందర్భంగా న్యాయవాద సమస్యలను నామకు వివరించారు. లోక్ సభలో న్యాయవాదుల రక్షణ బిల్లు ప్రవేశ పెట్టే విధంగా కృషి చేయాలని కోరారు. ఇటీవల కాలంలో భారత దేశ వ్యాప్తంగా న్యాయ వాదులపై క్రూరమైన దాడులు జరుగు తున్నా యని, అన్ని రాష్ట్రాల్లో న్యాయవాదులు తమ భద్రత గురించి ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారని, న్యాయవాద రక్షణ చట్టం బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే 2021 సంవత్సరంలో సెంట్రల్ నోటరీ కోసం న్యాయవాదుల నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానించారని, తెలంగాణ సంబంధించిన న్యాయవాదులు సుమారు 2000 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు వారికి ఎలాంటి సమాచారము కూడా తెలియజేయలేదని, ఇట్టి విషయంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్య తెలంగాణా వ్యాప్తంగా ఉందన్నారు. నామ నాగేశ్వరరావు వినతి పత్రం అందజేసిన వారిలో ఖమ్మం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గొల్లపూడి రామారావు, న్యాయవాదులు, తోటకూర శ్రీనివాసరావు, సింగం జనార్దన్ గౌడ్, కొత్తగూడెం ఇంతియాజ్, మణుగూరు న్యాయ వాది చంద్రకాని గురు కృష్ణ, సుప్రీంకోర్టు న్యాయవాది పుల్లభట్ల శ్రీ చక్రపాణి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

తక్షణమే సహాయక చర్యల్లో పాల్గొనండి

- అధికారులు, సిబ్బందికి మంత్రి పువ్వాడ ఆదేశం

ఖమ్మం, జూలై 27, (మనం న్యూస్): ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు భారీ వర్షాల ధాటికి మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది తక్షణమే సహాయక చర్యల్లో పాల్గొనాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశించారు. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో రాబోయే 48 గంటలు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నందున జాగ్రత్తగా వుండి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ను మంత్రి ఆదేశించారు. ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేరు ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తో కలిసి మంత్రి పువ్వాడ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన ప్రకారం జిల్లాలో 40 సెంటిమీటర్లకు పైగా వర్ష సూచన ఉన్నాయని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేస్తూ, పరిస్థితులను ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పిఆర్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ ఇంజనీర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాలైన వెంకటేశ్వర నగర్, మోతినగర్, బొక్కలగడ్డ, జలగం నగర్, ఊఇఐ, దానవాయిగూడెం ప్రజలను పూర్తి స్థాయిలో పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ ను ఆదేశించారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుందని, ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం నయాబజార్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు ప్రజలు వెళ్లాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న కల్వర్టుల వద్ద ప్రవాహం అధికమైన చోట ప్రజలు నేరుగా రాకపోకలు జరపకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌ను విష్ణు ఎస్.వారియర్‌ను ఆదేశించారు. ప్రమాదానికి ఆస్కారం వుండి, అవసరమున్నచోట రహదారిని మూసివేయాలని, రాకపోకలు జరపకుండా భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాద మున్న చెరువుల వద్ద ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షంలో చేపలు పట్టుటకు వెళ్లకుండా చూడాలన్నారు. లోతట్టు ముంపు ప్రదేశాల్లో వర్షపు నీరు ఇండ్లలోకి రాకుండా తగుచర్యలు చేపట్టాలన్నారు. అధికారులు ప్రధాన కార్యస్థానంలోనే ఉంటూ, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలు, పీఆర్, ఆర్ అండ్ బి రోడ్లపై, కల్వర్టులపై నీరు ప్రవహించే ప్రాంతాల్లో రవాణా నిషేధించి, రాత్రి పగలు సిబ్బందితో నిఘా పెట్టాలన్నారు. రోడ్లపై రవాణా నిషేధించిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ రోడ్లను సూచిస్తూ, 2 కి.మీ. ముందుగానే సూచికలు ప్రదర్శించాలని, ప్రవాహనికి ఇరువైపుల ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి, సిబ్బందిని కాపలా పెట్టాలని ఆయన తెలిపారు.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

- డీఎస్పీ రమణమూర్తి

ఇల్లందు, జూలై 27 (మనం న్యూస్)ః మూడు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని డిఎస్‌పి రమణమూర్తి సూచించారు. అవసరం ఉంటేనే తగు జాగ్రత్తలతో బయటికి రావాలని తెలిపారు. పిల్లలు.. వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని, బయట కరెంట్ స్తంభాలు పట్టుకోరాదని, రోడ్ల మీద మ్యాన్ హోల్స్ తో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతన్నలు పొలాల దగ్గర విష సర్పాలు, విద్యుత్ స్తంభాల దగ్గర జాగ్రత్తగా ఉండాలన్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

పినపాక, జూలై 27, (మనం న్యూస్): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకోవాలని ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అధి కారులను ఆదేశించారు. గురువారం ఎల్చి రెడ్డిపల్లి కస్తూరిబా స్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడారు. వర్షాలు తగ్గేవరకు పునరావాస కేంద్రంలో ఉండాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఎవరు ఉండకూడదని వారికోసం పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే స్థానిక అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తాసిల్దార్ ప్రసాదరావు, డిప్యూటీ తాసిల్దార్ రాజారావు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఓ వెంకటేశ్వరరావు,ఎంపీపీ గుమ్మడి గాంధీ, రైతు సమన్వయ సంఘం అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ దిలీప్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

హృదయ విదారకం

- ఆదుకున్న అపన్న హస్తాలు
- పొత్తిళ్లలో బిడ్డను పెట్టుకొని సాయం కోసం చూస్తున్న తల్లి

అశ్వాపురం, జూలై 27 (మనం న్యూస్): మండల పరిధిలోని మల్లెల మడుగు గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి గోదావరి వరదలు ఆ కుటుంబాన్ని ముంచెత్తడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబం నిలిచింది. సమాచారం అందుకున్న యువసేన నాయకులు హుటాహుటిన ఆ కుటుంబాన్ని రక్షించి పునరవాస కేంద్రానికి తరలించారు. అర్ధరాత్రి సమయంలో పిడమర్తి శ్రీను ఇంటిని వరద ముంచె త్తడంతో ఆ కుటుంబంలోని ఇల్లాలు చంటి బిడ్డను పొత్తిళ్లలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ చేతులు కట్టుకొని తలా ఓ మూలన సహాయం కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. సమీప కుటుంబం వారి పరిస్థితిని గమనించి యువసేన వారికి సమాచారం అందజేశారు. వర్షాలు మొదలైన నాటినుంచి యువసేన వారు వరదల్లో చిక్కుకున్న తుఫాను బారిన పడి ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకుంటామని వారు గ్రూపుల్లో మెసేజ్ పెట్టారు. ఈ విషయం తెలిసిన సమీప కుటుంబం యువసేన కు సమాచారం అందజేశారు. దీంతో ఆ కుటుంబం వరద ముంపు నుంచి ఆదుకోబడింది. ఆ కుటుంబ పరిస్థితిని చూసి అయ్యో అంటున్నారు. అలాగే యువసేన నాయకులను అభినందనలతో ముంచెత్తుతున్నారు.

బోధన్ ఎసిపి బదిలీ

బోధన్, జూలై 27 (మనం న్యూస్) పోలీసుల బదిలీలో భాగంగా బోధన్ ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్ బదిలీ అయ్యారు. బుధవారం బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయన స్థానంలో విజయ సారథిని బోధన్ ఎసిపిగా గా నియమించింది. బదిలీ అయిన కిరణ్ కుమార్ ను హైదరాబాద్ ముఖ్య కార్యాలయానికి రిపోర్ట్ చేయవలసిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి.

అంతర్రాష్ట్ర రహదారి మూసివేత

బోధన్, జూలై 27, (మనం న్యూస్): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం మంజీరా పరివాహక ప్రాంతంలో భారీగా వరద పొంగిపొర్లడంతో తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో సాలురా వద్ద ఉన్న పాతకాలం నాటి రాతి వంతెన నీట మునగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 63వ అంతర్రాష్ట్ర జాతీయ రహదారిని మూసివేస్తున్నట్టు జాతీయ రహదారుల విభాగం అధికారులు తెలిపారు.మంజీరా నదికి పైనుండి భారీగా వరద పోటెత్తడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ట్రాఫిక్ ను బిలోలి కొండల్ వాడి, ధర్మాబాద్ మీ దుగా మళ్ళించినట్టు అధికారులు తెలిపారు.

వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నాం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్, జులై 27, (మనం న్యూస్): జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరద తాకిడికి లోనైన బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో 76 కుటుంబాలకు చెందిన 273 మంది సభ్యులు పునరావాస కేంద్రాల్లో వసతి పొందుతున్నారని తెలిపారు. కమ్మర్పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన 60 మంది విద్యార్థినులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించామన్నారువేల్పూర్ లోని మదర్సకు చెందిన 12 మంది విద్యార్థులను స్థానిక షాదీ ఖానాలో పునరావాసం కల్పిస్తున్నామన్నారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో 60 కుటుంబాలకు చెందిన 144 మంది సభ్యులను గూపన్పల్లిలోని ఇంపీరియల్ గార్డెన్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించామని తెలిపారు. అలాగే బోధన్ మున్సిపల్ పట్టణంలో 20 మంది, నవీపేట మండల కేంద్రంలో 17 మంది, మెండోరా మండలం దూద్గాం లో 14 మంది, రెంజల్ మండలం బాగేపల్లిలో ఆరుగురు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించినట్లు వివరించారు. జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ప్రజలు భయాందోళనకు లోను కావద్దని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు.

అలుగు పారుతున్న పల్లికొండ చెరువు

- జెసిబి ద్వారా నిండు గర్భిణి తరలింపు

భీంగల్, జులై 27, (మనం న్యూస్): నిరాటంకంగా కురుస్తున్న వర్షాల కారణంగా పల్లికొండ చెరువు అలుగుపారుతూ రోడ్డు వెంట నీరు ప్రవహిస్తూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పిప్రి గ్రామానికి చెందిన పతాని అనిల అనే నిండు గర్భిణీకి పురిటి నొప్పులు అధికం కావడంతో ఆమెను జెసిబి ద్వారా నీటి ప్రవాహం నుంచి దాటించి ఆర్మూర్లోని అస్పత్రికి తరలించారు. జెసిబి సహకారంతో రోడ్డు దాటించి పల్లికొండ వరకు వచ్చి రెడీ గా ఉన్న అంబులెన్సు లో ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గర్భిణీకి అండగా వచ్చిన ఏఎన్ఎం జమున, అత్త సౌజన్య తో పాటు సహకరించిన అంబులెన్సు సిబ్బంది సుందర్, తిరుపతి లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కేజీబీవీ స్కూల్ చుట్టూ వర్షపు నీరు

- విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి వేముల

కమ్మర్పల్లి,జూలై 27(మనం న్యూస్) కమ్మర్పల్లి మండల కేంద్రములోని కేజీబీవీ స్కూల్ చుట్టూ వరద నీరు చేరడంతో విద్యార్థినులను అక్కడనుండి పక్కనే ఉన్న ఎంపీడీఓ ఆఫీస్ కి తరలించారు.అనంతరం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వారిని కలిసి ధైర్యం చెప్పారు. గురువారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కేజీబీవీ స్కూలు సందర్శించి వారికి భోజన సౌకర్యం ఇతర అవసరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు,స్థానిక సర్పంచ్ కి సూచించారు. వరద తగ్గాక వారి స్వస్థలాలకు పంపించాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు..

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి
- అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఆర్మూర్, జులై, 27 (మనం న్యూస్): రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నే పథ్యంలో మరో నాలుగైదు రోజుల పాటు ఆర్మూర్ నియోజకవ ర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తతతో ఉండాలని ఆర్మూర్ ఎమ్మెల్యే, జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగి ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం లేకుండా విస్తృతస్థాయిలో చర్యలు తీసుకోవా లని ఆయన ఆదేశించారు. విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గురువారం ఆర్మూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స మీక్ష నిర్వహించారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన అధి కారులకు ఖరాఖండిగా చెప్పారు. పలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, కాలువలు పూర్తిస్థాయి నీటి మట్టంతో ప్రవహిస్తు న్నా యన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాల్లో తగు జాగ్రత చర్యలను చేపట్టాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే ప్రదేశాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ముంపుకు గు రయ్యే ప్రమాదం ఉందని భావించే లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే ఎక్కడి కక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలను అక్కడికి తరలించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన ఆహార వస్తు సామగ్రి ఉండేలా చర్య లు తీసుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అధికారులను కోరారు. వర్షాలకు దెబ్బతినే రాష్ట్ర, నేషనల్ హైవే రోడ్లను వెంట నే మరమ్మతులు చేయాలని ఆయన ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉండేటట్టు అధికార యంత్రాంగం పనిచేయాలన్నా రు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి అని ఆయ న కోరారు. నిండిన చెరువులలో నీటిని వెంటనే కిందికి వదిలే బాధ్యతను ఇరిగేషన్ శాఖ అధికారులు సక్రమంగా అమలు చే యాలన్నారు.

విద్యుత్, ఇరిగేషన్, రెవె న్యూ, పోలీస్, మెడికల్ శాఖలు తదితర అనుబంధ శాఖలు నిబద్ధతతో కలసి పని చేయా లని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సూచించారు.

నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్, జులై 27, (మనం న్యూస్) గత కొద్ది రోజులుగా కురు స్తున్న భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అధికారులతో కలిసి పరిశీలించారు. నాగారం, భారతి రాణి కాలని,పూజారికాలని, బాబాన్ సాబ్ పహాడి, దొడ్డి కొమురయ్య కాలని, ధర్మపురి హిల్స్, కాలనీలని పరి శీలించారు. బాబాన్ సాబ్ పహాడి వద్ద మహబూబ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతులని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు.అనంతరంఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేప థ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. విపత్తును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సిద్ధంచేశామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. పునరావాస కేంద్రాలలో భోజన వసతి మంచి నీటి వసతి కల్పించామనీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా తెలిపారు. నగర పాలకసంస్థ కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని, 08462-221001 నంబర్ కాల్ చేసి సహాయంతీసుకోవాలని ఆయన అన్నారు. అవసరమైతేనె తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దని ఆయన ప్రజలను తెలిపారు.దూర ప్రయాణాలను వర్షాలు తగ్గే వరకు వాయిదా వేసుకోవాలని ఆయన అన్నా రు. విద్యుత్ స్తంభాలు షాక్ కొట్టే అవకాశం ఉన్నందున విద్యుత్ స్థంబాల కు దూరంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. శిథిలా భవనాల్లో ఉంటే వెంటనే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆయన సూచించారు. చెరువులు, కాలువలు,కుంటల వద్దకు చిన్న పిల్లలు వెళ్లకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, డిప్యూటి మేయర్ ఇద్రిస్ ఖాన్ బిఆర్ఎస్ నాయకులు,దండు శేఖర్, మున్సిపల్ అధికారులు సాగర్,మురళి, రషీద్ పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బోధన్,జులై 27, (మనం న్యూస్): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బోధన్ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గురువారం ఒక ప్రకట నలో ఎమ్మెల్యే షకీల్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్త వహిం చాలని అన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పోలీస్ యంత్రాంగం పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే షకీల్ అమెర్ ఆదేశించారు.మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అధికారుల సమన్వయంతో పట్టణంలో అన్ని వార్డుల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సహా యక కేంద్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసే విధంగా చూడాలని ఆర్డీవో రాజాగౌడ్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు తమ గ్రామాల్లో ఏ ఇబ్బంది ఉన్న సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.నీటిపారుదల శాఖ ,వ్యవసాయ శాఖ అధికా రులు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో కూలడానికి అవకాశం ఉన్న పాత ఇళ్లను గుర్తించి అందులో నివాసం ఉన్న ప్రజలను ఖాళీ చేయించి వా రిని సురక్షితప్రాంతానికి తరలించాలని మండల అధికారులను ఎమ్మె ల్యే ఆదేశించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ప్రజలకు అందు బాటులో ఉండాలని కోరారు.

జల ప్రళయం

- భారీ వర్షాలకు వణుకుతోన్న ఊర్లు
- మత్తడి దూకుతోన్న చెరువులు, కుంటలు
- నిండు కుండల్లా జలాశయాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక ప్రాంతాలకు నిలిచిపోయిన రాకపోకలు

కరీంనగర్ బ్యూరో, జులై 27, (మనం న్యూస్): నిరాటంకంగా కురుస్తోన్న వర్షాలు జన జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన మొదటి నెల రోజుల పాటు జాడ లేని వానలు ఒకే సారి విరుచుకుపడ్డట్లుగా గత వారం రోజులుగా నిరాటంకంగా కురుస్తుండడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి. చెరువులు, కుంటలు మత్తడి దూకుతూ వివిధ గ్రామాలు, పట్టణాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మిడ్ మానేరు, లోయర్ మానేరు జలాశయాలు నిండుకుండల్లా మారాయి. మిడ్ మానేరులో ఇన్ ఫ్లో అధికంగా ఉండడంతో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు 22 గేట్లను ఎత్తి బయటకు నీటిని వదులుతున్నారు. అ దేవిధంగా కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాంలోకి వదర నీరు అధికంగా చేరుతూ గరిష్ట సామర్థ్యానికి దగ్గరగా రావడంతో పదహారు గేట్లను ఎత్తిన అధికారులు దిగువకు నీటిని వదులుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక వాగులు, చెరువులు పొంగి పొర్లుతూ ప్రధాన రహదారుల వెంట ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పలు పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసి అధికారులు బస్సులను నిలిపివేశారు. భారీ వర్షాల కారణంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఆయా ప్రాంతాల్లోని రోడ్ల వెంబడి నీరు ప్రవహించడమే కాకుండా, పలువురి ఇండ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరం లోని ఆర్టీసి వర్క్‌షాపు సమీపంలోని జగిత్యాల ప్రధాన రహదారిపై బుధ వారం రాత్రి నుంచే వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ ప్రాంతం గుండా వెళ్లే ఆర్టీసి బస్సులను దారి మళ్లించి పంపించారు. గురువారం మధ్యాహ్నం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో రోడ్డు డివైడర్లను తొలగించి, నీటిని దారి మళ్లించారు.

రాజన్న సిరిసిల్లలో...

నిరాటంకంగా కురుస్తోన్న వర్షాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా అతలాకుతలం అవుతోంది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలోని కామారెడ్డి- కరీంనగర్ ప్రధాన రహదారి మొత్తం జలమయమైంది. పట్టణంలోని శాంతినగర్, అశోక్ నగర్, అనంత్ నగర్, పాత బస్ స్టాండ్ ఏరియాతో పాటు పలు ప్రాంతాలు వరద నీటితో నిండి పోయాయి. ఆయా ప్రాంతాల్లోని రహదారులపై నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మార్కెట్ ఏరియా పెద్ద బజార్, ఆటో నగర్ ప్రాంతాల్లో వరద తాకిడికి వ్యాపార వాణిజ్య కేంద్రాలు మూసివేశారు.

జమ్మికుంటలో...

నిరాటంకంగా కురుస్తోన్న వర్షాలు జమ్మికుంట మండలాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జమ్మికుంట పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ వరద నీటితో మునిగిపోయింది. భారీ వర్షాల కారణంగా బుధవారం రాత్రి నుంచే కాలనీలోని ఇండ్లల్లోకి వరద నీరు చేరింది. కాలనీలో నాలుగు వందలకు0 పైగా ఇళ్లు నీట మునిగాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. దీంతో పాటుగా అంబేద్కర్ కాలనీ, మోత్కులగూడెంలోని కొంత భాగం, నీట మునిగాయి. కాగా జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని దాదాపు అన్ని గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి.

చిగురుమామిడిలో...

ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలు చిగురుమామిడి మండలాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. మండలంలోని అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. మండలంలోని ఇందుర్తి, ఒగులాపూర్ గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రెండు గ్రామాల చుట్టూ నీరు చేరడంతో ప్రజలు ఆయా గ్రామాలను దాటి బయటకు వెళ్లలేని దుస్థితి దాపురించింది. వరుసగా కురుస్తున్న వర్షాలకు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మత్తడి దూకడంతో చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల్లో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. వరద నీరు భారీ చేరడంతో ఇందుర్తి, కరీంనగర్, కోహెడ తదితర ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు ఎక్కడికక్కడ నిలిపివేశారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో వరద నీరు భారీ చేరడంతో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పలు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఈ సందర్భంగా గ్రామానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

శంకరపట్నంలో...

మండలంలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో అనేక ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని చెరువులు, కుంటలు నిండి వరద నీరు రోడ్డు వెంట ప్రవహించడంతో తాడికల్, కాచాపూర్, అర్కండ్ల, ముత్తారం, వంకాయ గూడెం, మెట్టుపల్లితో పాటు పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గ్రామాల్లోని రోడ్లు, ఇండ్లు, స్మశాన వాటికలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి.

సైదాపూర్‌లో...

వరదనీరు పోటెత్తడంతో మండలంలోని సోమారం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి ఆనుకొని ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రమాదకర స్థాయిలో వాగు కల్వర్టు పై నుండి భారీగా ప్రవాహం కొనసాగుతుండడంతో గ్రామానికి రాకపోకలు తెగిపోయాయి. ఎగువన ఉన్న గొలుసు కట్టు చెరువులు నిండి మత్తడి పడడంతో ఒక్కసారిగా వరద పోటెత్తడంతో గ్రామస్తులు భయం భయంగా కాలం గడుపుతున్నారు.

ఇల్లందకుంటలో..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బందంలో చిక్కుకున్నాయి. జనావాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరి అనేక మంది తీవ్ర అవస్థల పాలయ్యారు. పలు గ్రామాల్లోని ఇండ్లలోనికి నీరు రావడంతో ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇల్లందకుంట వార్డుల ప్రజలు లోతట్టు ప్రాంతంలో ఉన్న ఒకటి, రెండు, మూడవ వార్డుల్లోని ఇండ్లలోనికి నీరు చేరింది. పాతర్లపల్లి గ్రామంలోని పలు ఇండ్లల్లోకి వరద నీరు చేరడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పాతర్లపల్లి గ్రామం చుట్టూ ఉన్న వాగు వంకలు పొంగి పొర్లడంతో గ్రామం చుట్టూ నీరు చేరి, ఇతర గ్రామాలతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి రెండు వైపులా ఉన్న రహదారులపై వరద నీరు ప్రవహించడంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది.

తిమ్మాపూర్‌లో...

భారీ వర్షాల కారణంగా తిమ్మాపూర్ మండలంలోని పలు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. మన్నెంపల్లి గ్రామంలో వరద కాలువకు గండ్లు పడి వరద నీరు ఇండ్లల్లోకి చేరింది. అకస్మాత్తుగా నీరు చేరడంతో గ్రామంలోని పలు కుటుంబాలు, ప్రజలు పూర్తిగా నిరాశ్రయులుగా మారారు.

కొత్తపల్లిలో..

భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా కొత్తపల్లి చెరువు నిండు కుండలా మారింది. భారీగా వరద నీరు చేరడంతో అలుగుపారింది. వరాల కారణంగా పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని రహదారులపై నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

కోరుట్లలో...

గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కోరుట్ల పట్టణం కాలనీలన్ని నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారి మీద మోకాళ్ళ లోతు వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు రాకపోకలను నియంత్రించి నీటి ప్రవాహం తగ్గాక అనుమతించారు. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, ఝాన్సీ రోడ్, గంగంపేట్, ఆదర్శనగర్, ముత్యాల వాడ, కల్లూరు రోడ్డు కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి.

రైతులకు కావాల్సిన సహాయాన్ని అందించాలి

- వరి నాట్లకు కొంత ఆలస్యం
- క్లోరినేషన్ చేసి తాగునీటిని సరఫరా చేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి ప్రతినిధి, జులై 27 (మనం న్యూస్) : వర్షాల వల్ల వరి నాట్లకు కొంత ఆలస్యం జరిగిందని కావున రైతులకు కావాల్సిన సహాయాన్ని అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారులకు సూచించారు. ఐడిఓసి భవనంలో జిల్లా వ్యవసాయ, నీటి పారుదల శాఖతోపాటు ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువులకు నీరు చేరుతున్నందున రైతులందరూ వరి నాట్లకు మొగ్గు చూపుతారని, వారికి సాంకేతికంగా సరైన అవగాహన కల్పించాలని, అందుకు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి కోరారు. నాణ్యమైన విత్తనాలు అందరికీ అందుబాటులో ఉండాలని, ఎలాంటి లోపాలు జరిగిన తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయిల్ ఫాం తోటల పెంపకంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డ్రిప్ ఇరిగేషన్ వెంటనే గ్రౌండింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం నుండి లభించే ప్రోత్సాహకాల పట్ల రైతులకు గ్రామ స్థాయిలో రైతు వేదికల వద్ద నిరంతరం రచ్చ జరగాలన్నారు. పాత ఇళ్లల్లో, మట్టి మిద్దెల్లో ఉండే వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు మున్సిపల్, ఎంపిడిఓలు తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి ప్రవాహం గల రహదారుల కల్వకర్టుల వద్ద, ప్రాజెక్టుల వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్లోరినేషన్ చేసి తాగునీటి సరఫరా చేయాలి

తాగునీరు కలుషితం గాకుండా క్లోరినేషన్ చేయాలని, ఎప్పటికప్పుడు డ్రైనేజీ శుభ్రం చేయాలని, అంటు వ్యాధులు ప్రభలకుండా నీటి నిల్వలు లేకుండా చూస్తూ బ్లీచింగ్ పౌడర్‌ను ఉపయోగించాలన్నారు. జిల్లాలోని పంచాయతీ అధికారి డిఆర్‌డిఓడిఎల్పీ ప్రతి రోజూ గ్రామాలను సందర్శించి నిబద్ధతతో పని చేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉన్న 2బిహెచ్‌కె వద్ద పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, అవసరమైన చోట రక్షణ ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను కోరారు. మంచినీరు, విద్యుత్ సౌకర్యాల లోపం ఉండొద్దని, కల్వర్టులు, రోడ్ల స్థితిపై ప్రతి రోజూ సమీక్ష చేసి రవాణాకు సిబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. పెబ్బేరు, వనపర్తి ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు ఆలస్యంగా జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ జిల్లా వైద్యాధికారి ఆస్పత్రులను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పెబ్బేరులోని ఆస్పత్రికి అవసరమైన మరమ్మతులు చేయాలని కోరారు. కేటాయింపులను నిర్లక్ష్యం చేయకూడదని వనపర్తి ఆర్డీఓను ఆదేశించారు. పాలిటెక్నిక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు వెంట మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వ శాఖల వారు అవసరమైన మొక్కలను స్థానికంగా ఉన్న గ్రామాల నర్సరీలు, అటవీ శాఖ నర్సరీల ద్వారా పొందాలని, ప్రస్తుతం అవసరమైన అన్నీ మొక్కలు లభ్యంగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రజలకు అందిస్తున్న పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అడిషన్ కలెక్టర్‌ను ఆదేశించారు. వనపర్తిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం, టౌన్ హాల్ నుండి మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, అడిషనల్ కలెక్టర్ తిరుపతి రావు, నీటి పారుదల శాఖ ఇంజనీరు, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్స్, ఆర్ అండ్‌బి ఇంజనీర్లు, మిషన్ భగీరథ ఇంజనీర్లతో పాటు జిల్లా వైద్యాధికారి, డిఆర్‌డిఓ, జెడ్పీ సిఇఓ, జిల్లా వ్యవసాయ అధికారి ఫైర్ స్టేషన్ అధికారి, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, వనపర్తి తహసీల్దార్ పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రధాని లక్ష్యం

- తెలంగాణలో 4వేల రైతు సేవా కేంద్రాలు
- 14 విడతల్లో తెలంగాణకు రూ. 2లక్షలా 70కోట్ల నిధులు విడుదల
- మాజీ ఎమ్మెల్సీ ఎస్ రామచంద్ర రావు

వనపర్తి ప్రతినిధి జులై 27 (మనం న్యూస్) : దేశానికి అన్నం పెట్టే రైతన్నను రాజును చేయడమే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ ఎస్. రామచంద్ర రావు పేర్కొన్నారు. కిసాన్ సమృద్ధి సేవా కేంద్రాలను ప్రారంభించే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ. రాజవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పాత మార్కెట్ యార్డ్ మన గ్రోమోర్ రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, సుప్రీం కోర్టు న్యాయవాది ఎస్ రామచంద్ర రావు మాట్లాడారు. ప్రధాన మంత్రి కిసాన్ సేవా కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయిన 1లక్షా 25వేల ఎరువుల రిటైల్ షాపులను ప్రారంభించారని తెలిపారు. మన రాష్ట్రంలో 4వేల రైతు సేవా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని, ఈ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, భూ సార, విత్తన పరీక్షలు, వ్యవసాయ పరికరాల లభ్యత, నూతన వ్యవసాయ పద్ధతుల మీద అవగాహన, మందుల పిచికారికి అవసరమయ్యే డ్రోన్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిఎం కిసాన్ సమ్మాన్ నిధి 14వ. విడత దేశంలోని 8.5కోట్ల మంది రైతులకు బ్యాంక్ ఖాతాల్లో రూ. 17వేల కోట్లు జమ అయ్యాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం 39లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉన్నారని, ఇప్పటి దాకా కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుల ఖాతాల్లోకి రూ. 2లక్షలా 70వేల కోట్లు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు సబిరెడ్డి వెంకటరెడ్డి, బి. కృష్ణ, జింకల కృష్ణయ్య, జిల్లా అధికారులు కె. మాధవ రెడ్డి, ఏ. రామన్ గౌడ్, కేతూరి బుడ్డన్న, సుమిత్రమ్మ, కుమారస్వామి, రామన్న, వెంకటేశ్వర్ రెడ్డి, ఎ. సీతారాములు, బాసెట్టి శ్రీను, విజయ భాస్కర్, పెద్దిరాజు, చిత్తారి ప్రభాకర్, కొమ్ము సామేలు, కదిరే మధు, కల్పన, బి. అనుజ్ఞా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, దాసరాజు ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సూగూరు రాము, ఎం. రామన్న సాగర్, మండల అధ్యక్షులు, సర్పంచు ఎ. దేవేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, కృష్ణ గౌడ్, ఐటిసెల్ విజయ్ సాగర్, చుక్క సతీష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ ఆదేశం

నాగర్ కర్నూల్ ప్రతినిధి జులై 27 (మనం న్యూస్) : జిల్లాలో రాబోయే రెండు రోజుల్లో ఓ మోస్తరు వర్షాలు పడు అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ నివేదిక ఇచ్చినందున ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వారం రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని ఆర్డీఓలు, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలతో కలెక్టర్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసునేందుకు ఏ శాఖ నుండి అయినా అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వారం రోజుల నుండి వర్షాలకు తడిచి కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్లను, పశువుల కొట్టాలను గుర్తించి సురక్షిత శిబిరాలకు తరలించాలని సూచించారు. అలాగే కాజ్‌వేల నుండి ఎక్కడెక్కడ నీరు పారుతుంది అనే వివరాలు సేకరించి ప్రయాణీకులను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైన చోట్ల భారీ కేడ్లను ఏర్పాటు చేసి అక్కడికి ఎవ్వరూ వెళ్లకుండా మనుషులను పెట్టాలని సూచించారు. అకస్మాత్తుగా భారీ వర్షం పడి కాజ్‌వే పొంగే ప్రమాదం ఉంటుంది కావున అలాంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. చెరువులు నిండి అలుగు పారుతున్న వాటిని ముందే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటి కోసం జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పంచాయతీ సెక్రటరీల సహకారం, జెడీప సిఇఓ ద్వారా ఎంపిడిఓలు వారి సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. జూరాల నుండి నీటి విడుదల ప్రారంభం అయ్యిందని, నది పరివాహక ప్రాంతల గ్రామాలను గుర్తించి గ్రామ ప్రజలు నదిలోకి వెళ్లకుండా, పశువుల కాపర్లు పశువులను విడువకుండా, జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా గ్రామాల్లో టాంటామ్ వేయించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా, ఎలాంటి విపత్తు సంభవించినా ఎదుర్కొనేలా సర్వ సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 30ఇళ్లు వర్షాలకు తడిచి పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు.

ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్

ఓటరు నమోదు దరఖాస్తుపై సమీక్షిస్తూ.. అన్ని రకాల ఓటరు దరఖాస్తులను ఈ రోజు సాయంత్రంలోగా పరిష్కరించాలని ఇఆర్‌ఓలను కలెక్టర్ ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ నేటితో గడువు ముగుస్తుందని, తర్వాత జిల్లాలో 18-19 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న యువతను గుర్తించి ఓటరు జాబితాలో పేర్లు నమదు చేసేలా బిఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఒక ఇంటి నెంబర్ నుండి 6, అంతకనాన ఎక్కువ ఓటర్ల పేర్లు తొలగించాల్సి వచ్చినప్పుడు తహసీల్దార్ స్వయంగా వెళ్లి పరిశీలించాలని సూచించారు. జిల్లాలో నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో గుర్తించిన ఖాళీ స్థలాల్లో లే అవుట్‌లు వేయించి లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట లక్కీ డీప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు జాకీర్ హుస్సేన్, రవి కిరణ్, డి. చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాత ఇళ్లల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఆత్మకూర్ మండల ప్రత్యేక అధికారి భీరం సుబ్బారెడ్డి

వనపర్తి ప్రతినిధి, జులై 27 (మనం న్యూస్) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పాత ఇళ్లల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ మండల ప్రత్యేక అధికారి భీరం సుబ్బారెడ్డి సూచించారు. ఆత్మకూర్ మండలంలోని బాలకృష్ణాపురం, పిన్నంచర్ల గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను ఆయన గురువారం పరిశీలించారు. పిన్నంచర్ల గ్రామంలో కూలిపోయిన బోయ రాజు గుడిసెను, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇల్లు కూలే స్థితిలో ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా గ్రామ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాక్షికంగా దెబ్బతిన్న, కూలిపోయిన ఇళ్లపై నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్లకు అందజేస్తామని తెలిపారు. అనంతరం బాలకృష్ణాపూర్ గ్రామంలో పర్యటించి వార్డు వార్డు తనిఖీ చేశారు. ప్రజలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని విద్యార్థులు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వేడివేడి నాణ్యమైన భోజనాలు అందించాలని సూచించారు. ఆయనతోపాటు ఎంపిఓ నర్సింగ రావు, ఆయా గ్రామ కార్యదర్శులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

యువత అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఘనంగా అబ్దుల్ కలాం 8వ. వర్ధంతి
- ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్

వనపర్తి ప్రతినిధి, జులై 27 (మనం న్యూస్) : నేటి యువతీ, యువకులు డాక్టర్ ఏ.పి.జె అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో టిజెఎసి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, అంతరిక్ష శాస్త్రవేత్త డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం 8వ. వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ.. భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్త, రాజకీయవేత్త, మాజీ రాష్ట్రపతి, పద్మభూషణ్, పద్మ విభూషణ్, భారత రత్న ఎ.పి.జె అబ్దుల్ కలాం భౌతిక ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నాలుగు దశాబ్దాల పాటు శాస్త్రవేత్తగా సైన్స్ అడ్మినిస్ట్రేటర్గా, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ఇస్రో అంతరిక్ష కార్యక్రమం, సైన్స్ అభివృద్ధి ప్రయత్నాలు బాలిస్టిక్ మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందారని గుర్తు చేశారు. ప్రోక్రాన్-2 అణు పరీక్షల్లో అతను కీలకమైన సంస్థాగత సాంకేతిక, అనువర్తన ఆయుధాలు అభివృద్ధిలో ప్రముక పాత్ర పోషించిన రాజకీయ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని కొనియాడారు. సక్సెస్ అంటే మీ సంతకం ఆటోగ్రాఫ్‌గా మారడమే అని, మన జననం ఓ సాధారణమైది కావచ్చు కానీ మన మరణం ఒక చరిత్ర సృష్టించేదిగా ఉండాలని, నువ్వు సూర్యుడిలా ప్రకాశించాలి అనుకుంటే ముందు సూర్యుడిలా మండటానికి సిద్ధపడాలని కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని యువతలో దివ్య అగ్ని రగిల్చారని, యువతీ, యువకులు, విద్యార్థులు బాగా చదువుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. దివ్య స్వాప్నికుడు, కళా ప్రేమికుడు నిరంతర శోధకుడు విశ్వమానవుడు, మహా దేశ భక్తుడు ముగ్గురమ్మలను నమ్మిన శాస్త్రవేత్త, తత్వవేత్త, నిప్పులు చిమ్ముతూ నింగికేగే క్షిపణి అతడు, ప్రేమ నింపుతూ గుండెను తాకే మనిషి అతడన్నారు. కార్యక్రమంలో కవి పండితులు బూరోజు గిరిరాజా చారి, కవి శ్రేష్ఠుడు, వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, కవి, గాయకుడు విభూది ఈశ్వర్, తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు, రజక సంఘం జిల్లా అధ్యక్షులు బండ లయ్య, పాలిటెక్నిక్ సిబ్బంది నవీణ్, మణికుమార్, అబ్దుల్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్లను పరిశీలించి.. ఆర్థికసాయం అందజేసిన చిన్నా రెడ్డి

వనపర్తి ప్రతినిధి జులై 27 (మనం న్యూస్) : వనపర్తి మండలం కదుకుంట్ల గ్రామంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కూలిన ఇళ్లను మాజీ మంత్రి డాక్టర్ జి చిన్నారెడ్డి గురువారం పరిశీలించి బాధితులకు కొంత ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇల్లు కట్టుకోడానికి రూ. 5లక్షలు ఇస్తామన్నారు. ఎవ్వరూ భయపడొద్దని, ధైర్యంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లు లేని వారికి డబుల్ బెడ్‌రూం ఇస్తామని మాయ మాటలు చెప్పి 9ఏళ్లు అవుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీని నమ్మొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గోపాల్ పేట మండలంలో ఇల్లు కూలిపోయిన మంగ దొడ్డి కృష్ణయ్యను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. పదేళ్లు గడుస్తున్నా గోపాల్‌పేట మండలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల నుండి రూ. 3లక్షల వరకు ఇస్తామని ఇప్పుడు ఎలక్షన్ల ముందు డ్రామాలు ఆడుతుందని ప్రజలకు వివరించారు. చంద్రయాన్ గడ్డలో కుమ్మరి ఇల్లు పడిపోయిన నాగన్నను, తెలుగు కృష్ణను, బోయిన శ్రీను కొడుకు శివను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. మద్దిలేటి, చింతగిరి బాలయ్య, మేస్త్రీ హుస్సేన్ సుల్తాన్, మేకమ మాసయ్య ఇల్లు కూలిపోవడం బాధాకరమన్నారు. మాసయ్య ఇద్దరు కొడుకులు తలా ఓ గుడిసెలో జీవనం సాగిస్తున్నారని వారికి కరెండ్ సదుపాయం లేకపోతే కరెంట్ ఏఇకి ఫోన్ చేసి చంద్రన్న గడ్డలో రెండు స్తంబాలు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. అలాగే కూలిపోయిన ఇళ్లకు తక్షనమే ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సునీతకు ఫోన్ చేసి పడిపోయిన ఇళ్లను పరిశీలించి వాళ్లకు ప్రభుత్వం నుండి వచ్చే సహాయాన్ని అందించి ఆదుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్ నారాయణ, పాండు, మాజీ ఎంపిటిసి సురేష్ గౌడ్, వనపర్తి జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు రోహిత్, గోపాల్ పేట ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కదుకుంట్ల గ్రామ అధ్యక్షులు రాములు, సర్పంచు బాలకృష్ణ, మాజీ అధ్యక్షులు శంకరయ్య, మాజీ సర్పంచు మాధవి గోవర్ధన్, రవి కిరణ్, నాగన్న గౌడ్, శ్రీనివాసులు, హేమంత్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొంకి వెంకటేష్, గోపాల్ పేట టౌన్ అధ్యక్షులు శివన్న, ఉపాధ్యక్షులు నాగశేషు యాదవ్, యూత్ అధ్యక్షులు ఎం.డి బాలపీర్, మాజీ ఎంపిటిసి మేస్త్రీ బాలయ్య, సీనియర్ నాయకులు సుధాకర్ రావు, వెంకటయ్య, ధన్వాడ నాగరాజు, చంద్రాయని గడ్డ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- ఎస్ఐ యుగేందర్ రెడ్డి సూచన

వనపర్తి ప్రతినిధి జులై 27 (మనం న్యూస్) : జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ యుగేందర్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని కుమ్మరివీధి, రాయిగడ్డ, పోతులపల్లిగేరి, కమాన్, నడిమిగేరిలో పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పాత ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా కురుస్తున్నందున పాత ఇల్లు కూలే ప్రమాదం ఉంటుందని అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణ సమయంలో వాహనదారులు, ప్రయాణీకులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని తెలిపారు. విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్ ఫార్మర్‌లు చిన్న పిల్లలు ముట్టుకోకుండా చూసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో రోడ్లు, వంతెనలు తెగిపోయినా రాకపోకలకు ఆటంకాలు ఎదురైతే పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చెరువులు, వాగులు, కుంటలు నీటితో నిండి ఉప్పొంగి ప్రమాద స్థాయిలో ప్రవహించినప్పుడు వాటిని దాటే సాహసం చేయరాదన్నారు. పాత పాడు బడ్డ ఇళ్లల్లో నివసించరాదని, పాడుబడ్డ బావుల దగ్గర జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ప్రత్యేక సేవలందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తం చేసి అందుబాటులో ఉంటారని, ఆపత్కాలంలో ప్రజలు 100కు ఫోన్ చేసి తగిన సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. వర్షాలతో రోడ్లు ఇబ్బంది కరంగా మారుతాయని ప్రమాదాలకు గురవ్వకుండా వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. భద్రత పరిరక్షణలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్.ఐ యుగేందర్ రెడ్డి సూచించారు.

జిల్లా అదనపు కలెక్టర్‌గా కె.సీతారామరావు బాధ్యతల స్వీకరణ

నాగర్ కర్నూల్ ప్రతినిధి, జులై 27 (మనం న్యూస్) : జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె సీతారామ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్‌ను కలసి మొక్కను అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బాధ్యతలను తన ఛాంబర్‌లో స్వీకరించారు. కె సీతారామ రావు మహబూబ్‌నగర్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను మహబూబ్ నగర్ జిల్లాలో విధులు నిర్వహించినందున ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై అవగాహన ఉందని, తన శక్తి మేరకు జిల్లా అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు.

దేశ సేవకు అంకితమైన డాక్టర్ అబ్దుల్ కలాం

వనపర్తి ప్రతినిధి జులై 27 (మనం న్యూస్) : శాస్త్ర వేత్తగా, రాష్ట్రపతిగా సేవలందిస్తూ దేశానికే అంకితమైన మహనీయులు డాక్టర్ ఏ.పి.జె అబ్దుల్ కలాం అని టిడిపి అధ్యక్షులు నందిమల్ల అశోక్ తెలిపారు. అబ్దుల్ కలాం 8వ. వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నందిమల్ల అశోక్ మాట్లాడుతూ.. అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించి పట్టుదలతో చదివి శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి రక్షకునిగా నిలిచిన మేధావి అబ్దుల్ కలాం అని కొనియాడారు. దేశానికి చేసిన సేవలు గుర్తించి అప్పటి ఎన్‌డిఏ కన్వీనర్ చంద్రబాబు నాయుడు అబ్దుల్ కలాంని రాష్ట్రపతిగా ప్రతిపాదించి అటల్ బీహార్ వాజుపేయ్ ప్రభుత్వంలో రాష్ట్రపతిగా ఎంపిక చేసి గౌరవించారని గుర్తు చేశారు. అబ్దుల్ కలాం సాధారణ జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఎండి గౌస్, ఆవుల శ్రీను, బండారు, గోపాల్, వహీద్, డి. బాలరాజు, కొత్త గొల్ల శంకర్, అనీల్ పాల్గొన్నారు.

అందుకే సంజూ శాంసన్‌ను తీసుకోలేదు: రోహిత్ శర్మ

బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ నిర్ణయం తీసుకోవడానికి బలమైన కారణం ఏం లేదని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. జట్టుగా విభిన్నంగా ప్రయత్నిద్దామనే ఛేజింగ్‌కు మొగ్గు చూపానని తెలిపాడు. వరల్ కప్ నేపథ్యంలో ఎలాంటి సందేహాలు లేకుండా టీమ్ కాంబినేషన్ ఎంచుకోవాలనుకుం టున్నామని తెలిపాడు. ప్రపంచకప్ కోసం ఆటగాళ్ల సత్తాను పరీక్షిస్తామని, ఈ క్రమంలో ఫలితాలపై అస్సలు రాజీపడని చెప్పాడు. ఓవైపు ప్రయోగాలు చేస్తూనే మరోవైపు విజయాల కోసం కృషి చేస్తామని తెలిపాడు. మూడు ఫార్మాట్లలో ఆడే ఆటగాళ్లు పరిస్థితులను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. విండీస్‌తో సిరీస్‌లో తాము అనుకున్న ఫలితాన్ని అందుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశాడు. నలుగురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నామని చెప్పిన రోహిత్.. ఈ క్రమంలోనే అక్షర్ పటేల్ను తీసుకోలేదన్నాడు. లెఫ్ట్ రైట్ కాంబినేషన్ కోసం సంజూ శాంసన్ను పక్కన పెట్టాల్సి వచ్చిందన్నాడు. అక్షర్ పటేల్‌కు బదులు శార్దూల్ ఠాకూర్ జట్టులోకి వచ్చాడు. గాయంతో జట్టుకు దూరమైన మహమ్మద్ సిరాజ్ స్థానంలో ముకేష్ కుమార్ అరంగేట్రం చేయగా.. ఉమ్రాన్ మాలిక్ రీఎంట్రీ ఇచ్చాడు.ప్రతీ సిరీస్ ముఖ్యమైనేదనని, ప్రతీ మ్యాచ్, సిరీస్ గెలవాల్సిందేనని వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ అన్నాడు. టాప్ ట్రీ గెలిచే అవకాశం తమకు దక్కిందని, తమ జట్టులో క్వాలిటీ స్పిన్నర్లు ఉన్నారని తెలిపాడు. సరైన ప్రదేశాల్లో బౌలింగ్ చేయడమే తమ లక్ష్యమని, తమ అవకాశాలను అందిపుచ్చుకుంటామని తెలిపాడు.గతంలో కొన్ని అవకాశాలను తాము చేజార్చుకున్నామని, సమిష్టి ప్రదర్శన చేస్తే విజయం సాధించవచ్చన్నాడు. భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచి విజయాన్నందకుంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఒషానే థామస్, అల్జారీ జోసెఫ్, కెవిన్, కీసీ కార్టీ ఈ మ్యాచ్కు దూరమయ్యారని తెలిపాడు.

తుది జట్లు:

భారత్: రోహిత్ శర్మ, శుభ్మన్ గిల్, విరాట్ కోహ్లీ, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, ఉమ్రాన్ మాలిక్, ముకేష్ కుమార్

వెస్టిండీస్: షై హోప్, కైల్ మేయర్స్, బ్రాండన్ కింగ్, అలిక్ అథంజే, షిమ్రాన్ హెట్మైర్, రోవ్మన్ పావెల్, రోమారియో షెఫెర్డ్, యాన్నిక్ కరయ్య, డొమినిక్ డ్రేక్స్, జైడన్ సీల్స్, గుడకేశ్ మోతీ

వరల్డ్ కప్ షెడ్యూల్‌లో మార్పులు నిజమే

భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సంగతి..? : జై షా

వన్డే వరల్ కప్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మ్యాచ్ తేదీ మారనుందనే వార్తలు రెండు రోజులుగా ఆన్లైన్లో వైరల్ అవుతున్నాయి. అదే జరిగితే పెద్ద మొత్తంలో నష్టపోతామంటూ చాలామంది ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో.. వరల్ కప్ షెడ్యూల్లో మార్పులు నిజమేనని భారత క్రికెట్ బోర్డు సెక్రటరీ జై షా అన్నాడు. షెడ్యూల్ మార్చాలంటూ రెండు, మూడు బోర్డుల నుంచి అభ్యర్థనలు వచ్చాయని, త్వరలోనే తేదీల మార్పు గురించి వెల్లడిస్తామని అతను తెలిపాడు. అయితే.. భారత్, పాకిస్థాన్, మ్యాచ్ గురించి మాత్రం జై షా ప్రస్తావించకపోవడం గమనార్హం. 'మ్యాచ్ తేదీలు మార్చాలంటూ మాకు రెండు, మూడు బోర్డుల నుంచి వినతులు వచ్చాయి. అయితే.. అవి భారత్, పాకిస్థాన్ మ్యాచ్కి సంబంధించినవి కావు' అని జై షా స్పష్టం చేశాడు. దాంతో, దాయాదుల పోరు గురించి చెప్తారని ఎంతో ఆశించిన అభిమానులు ఒకింత నిరాశకు గురయ్యారు.

అదే రోజు నవరాత్రులు

భారత్, పాకిస్థాన్ మ్యాచ్ అంటే అభిమానుల్లో ఎక్కడలేని ఆసక్తి ఉంటుంది. వరల్ కప్ లాంటి మెగా టోర్నీల్లో అయితే ఈ మ్యాచ్కు ఉండే క్రేజే వేరు. ఈ ఏడాది వరల్ కప్ టీమిండియా, పాక్ హై ఓల్టేజీ మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం అహ్మదాబాద్‌లో అక్టోబర్ 15న జరగాల్సి ఉంది. అయితే.. అదే రోజు దేవీ నవరాత్రులు మొదలవ్వనున్నాయి. దాంతో, వేలాది మంది అభిమానులు తరలి వచ్చే ఈ మ్యాచ్కు భద్రత కల్పించడం కష్టమవుతుందని.. అందుకని మ్యాచ్ను ముందు తేదీకి అంటే అక్టోబర్ 14న నిర్వహించాలని అహ్మదాబాద్ పోలీసులు బీసీసీఐని కోరారు. అయితే.. బీసీసీఐ మాత్రం తేదీని మారుస్తున్నట్లు ఎలాంటి ప్రకటన చేయలేదు. షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్ నిర్వహిస్తారా? లేదా ముందు రోజు ఆడిస్తారా? అనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది.

పాక్‌పై తిరుగులేని రికార్డు

వరల్ కప్‌లో భారత్‌కు పాక్‌పై తిరుగులేని రికార్డు ఉంది. ఇప్పటివరకూ ఇరుజట్లు ఏడుసార్లు తలపడగా ఏడుసార్లు మన జట్టే గెలుపొందింది. చివరిసారిగా భారత్, పాక్ 2019 వరల్ కప్‌లో ఢీ కొన్నాయి. అప్పుడు కూడా టీమిండియా దాయాదిని చిత్తుగా ఓడించింది. ఈసారి సొంత గడ్డపై వరల్డ్ కప్ జరుగనుంది. అందుకని ఇరుజట్ల పోరు కోసం అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 5న ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్‌తో వరల్డ్ కప్ ప్రారంభం కానుంది.

నెట్స్‌లో చక్కటి షాట్..

ఆపై కిరాక్ డ్యాన్స్‌తో అలరించిన కోహ్లీ

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మైదానంలో సిరియస్‌నెస్ కొనసాగిస్తూనే చిలిపి చేష్టలతో నవ్వులు పూయిస్తుంటాడు. మ్యాచ్ స్తబ్దుగా సాగుతున్న సమయంలో డ్యాన్స్ చేసి, విచిత్ర హావభావాలను ప్రదర్శించి ప్రేక్షకుల్లో జోష్ నింపుతుంటాడు. ఈ రికార్డుల రారాజు తాజాగా ఇలాంటి పనే చేశాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు నెట్స్లో పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో సాధన చేస్తున్న కోహ్లీ.. ఓ బంతికి చక్కటి షాట్ కొట్టి తనదైన శైలిలో సంబురాలు చేసుకు న్నాడు. 'మంచి బంతి వేస్తే ఇలా కొట్టాడేంటి..?' అన్నట్లు పాండ్యా చూస్తుంటే.. కోహ్లీ మాత్రం ఈ బంతి బౌండ్రీ దాటడం పక్కా అన్నట్లు డ్యాన్స్ చేశాడు. సాధారణంగా ఫీల్ అంపైర్లు ఫోర్ సిగ్నల్ ఇస్తున్నట్లు.. తనదైన డ్యాన్సింగ్ స్టైల్లో చేతులు ఊపుతూ విచిత్ర హావభావాలు పలికిం చాడు. ఈ వీడియో నెట్టింట్లో వైరల్గా మారగా.. అభిమానులు చిలిపి కామెంట్స్ చేస్తున్నారు.

ఐదొందల మ్యాచ్లో..

విండీస్తో జరిగిన రెండో టెస్టులో విరాట్ కోహ్లీ(121) అద్భుత సెంచరీతో రికార్డులు సృష్టించాడు. ఐదొందల అంతర్జాతీయ మ్యాచ్లో వంద కొట్టిన తొలి క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. అంతేకాదు దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ కంటే తక్కువ ఇన్నింగ్స్‌లోనే 76వ శతకం సాధించి మరో రికార్డు నెలకొల్పాడు.

కృతిసనన్ బర్త్‌డే

స్పెషల్ గిఫ్ట్..

'వన్ నేనొక్కడినే' సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసి తెలుగు ప్రేక్షకులను పలుకరించింది కృతి సనన్ . ఆ తర్వాత హిందీలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతున్న ఈ బ్యూటీ ఇటీవలే ప్రభాస్‌తో 'ఆదిపురుష్'లో నటించింది. ఈ మూవీలో సీత పాత్రలో మెరిసి మంచి మార్కులు కొట్టేసింది. వరుస ప్రాజెక్టులతో తీరిక లేకుండా ఉన్న కృతిసనన్‌కు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఇవాళ కృతిసనన్ బర్త్ డే సందర్భంగా కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టింది. కృతిసనన్ సొంతంగా స్కిన్ కేర్ బ్రాండ్‌ను లాంఛ్ చేసింది. వందశాతం శాఖాహార , ప్లాస్టిక్ రహిత పదార్థాలతో తమ ఉత్పత్తులు ఉండబోతున్నాయని కంపెనీ తెలిపింది. పెటా ఆమోదం కూడా పొందిందని తెలియజేసింది. ఫైనల్‌గా మీ ముందుకు.. గురువారం మీ అందరినీ హైఫన్ ప్రపంచానికి స్వాగతిస్తున్నప్పుడు నా హృదయం సంతో షంతో, కృతజ్ఞతతో నిండిపోయింది. హైఫన్ అనేది కొత్త అవకాశాలతోపాటు జీవితానికి మరిన్ని అధ్యాయాలను జోడించే ఆశ. నా జీవితంలోని ఈ అధ్యాయం చాలా ప్రత్యేకమైనది.. అంటూ కృతిసనన్ స్కిన్ బ్రాండ్ గురించి చెప్తున్న వీడియోను షేర్ చేయగా.. నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. కృతిసనన్ ప్రస్తుతం టైగర్ ష్రాఫ్‌తో కలిసి గణ్‌పథ్ పార్ట్ 1లో నటిస్తోంది. దీంతోపాటు మరో రెండు సినిమాలు ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి.

Kriti Sanon

నాలుగు డిగ్రీల చలిలో..

సమంత ఐస్ బాత్

టాలీవుడ్ స్టార్ నటి సమంత .. ప్రస్తుతం వెకేషన్‌ను ఎంజాయ్ చేస్తోంది. ఇటీవలే స్నేహితులతో కలిసి ఇండోనేషియా బాలికి వెళ్లిన సామ్.. అక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తోంది. రోజుకో వీడియో, ఫొటోలతో అభిమానులను అలరిస్తోంది. నిన్న జిమ్ లో స్టంట్ వీడియో షేర్ చేసిన సామ్.. తాజాగా ఎముకలు కొరికే చలిలో ఐస్ బాత్ చేసిన వీడియోను ఇన్ స్టా స్టోరీస్ లో షేర్ చేసింది. నాలుగు డిగ్రీల చలిలో ఆరు నిమిషాల పాటు ఐస్ బాత్ చేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. సమంత.. ఏడాది పాటు సినిమాలు బ్రేక్

తీసుకోనున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా మయోసైటిస్ వ్యాధితో బాధపడుతున్న సామ్.. తదుపరి చికిత్స కోసం అమెరికా వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తన చేతిలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసింది. విజయ్ దేవరకొండతో కలిసి ఖుషీలో నటించింది సామ్. ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదల కానుంది. ఇక బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ తో కలిసి సిటాడెల్ వెబ్ సిరీస్ ను కూడా సామ్ పూర్తి చేసింది. ఇది త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాని టీం నుంచి హాయ్

నాన్న షూటింగ్ అప్‌డేట్

టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న తాజా చిత్రం హాయ్ నాన్న. నాని 30గా వస్తోన్న ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ శౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ బ్యూటీ, సీతారామం ఫేం మృణాళ్ ఠాకూర్ హీరోయిన్గా నటిస్తోంది. రీసెంట్గా మేకర్స్ హాయ్ నాన్న ఫస్ట్ లుక్తోపాటు గ్లింప్స్‌ను విడుదల చేయగా.. నెట్టింట్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. కొన్ని రోజులుగా కొనసాగుతున్న షెడ్యూల్లో మృణాళ్ ఠాకూర్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేసిందని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అంతేకాదు త్వరలోనే నాని టీం నెక్స్ట్ షెడ్యూల్లో జాయిన్ కాబోతుందని టాక్. మృణాళ్ ఠాకూర్ ఇందులో యశ్న పాత్రలో నటిస్తోంది. నాని కూతురు పాత్రలో బేబి కైరా ఖన్నా నటిస్తోంది. మృణాళ్ ఠాకూర్ను తన స్నేహితురాలికి పరిచయం చేస్తూ బేబి కైరా చెప్తున్న డైలాగ్స్‌తో షురూ అయిన టైటిల్ గ్లింప్స్.. తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో హర్ట్ టచింగ్ ట్యూన్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. హాయ్ నాన్న చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజేందర్

రెడ్డి తీగల, మూర్తి కేఎస్ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి మలయాళం కంపోజర్, హృదయం ఫేం హెశమ్ అబ్దుల్ వహబ్ సంగీతం అందిస్తున్నాడు. మృణాళ్ ఠాకూర్, నాని, బేబి కైరా మధ్య సాగే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతున్నట్టు గ్లింప్స్‌తో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.

ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో వరుణ్ తేజ్

పాన్ ఇండియా చిత్రం

టాలీవుడ్ మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా ఇప్పుడు ఇంట్రెస్టింగ్ లైనప్‌తో వస్తున్నా సంగతి తెలిసిందే. ఇక ఈ లైనప్‌లో అయితే గత కొన్ని రోజులు నుంచి ఆసక్తిగా వినిపిస్తు న్న ఇంట్రెస్టింగ్ కాంబో దర్శకుడు కరుణ కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కే సినిమా కూడా ఒకటి. ఇక ఈ చిత్రం నుంచి అయితే మేకర్స్ ఈరోజు సాలిడ్ అప్‌డేట్‌ని అం దించారు. ఈ చిత్రానికి మేకర్స్ ఇంట్రెస్టింగ్ టైటిల్ మట్కా అనే దానిని ఫిక్స్ చేసి ఓ కాన్సెప్ట్ పోస్టర్‌ని కూడా రిలీజ్ చేసారు. దీనితో ఈ చిత్రం కంప్లీట్‌గా డబ్బులు బ్యాక్ డ్రాప్‌లోనే ఉంటుంది అని కన్ఫర్మ్ అయ్యింది. అలాగే ఈ చిత్రంలో ఇది వరకే వచ్చిన టాక్‌తో బాలీవుడ్ స్టార్ బ్యూటీ నోరా ఫతేహి కూడా కన్ఫర్మ్ అయ్యిపోయింది. అలాగే ఈ చిత్రంని అయితే మేకర్స్ పాన్ ఇండియా చిత్రంగా అనౌన్స్ చేయడం విశేషం కాగా షూటింగ్ త్వరలోనే స్టార్ట్ కానుంది. సంగీతం జివి ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.